ఆదివారం
27-08-2023
తిరుపతి ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 270
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నీటి ద్వారా కోవిడ్ వ్యాప్తి

యూరప్, ఆఫ్రికా, అమెరికా దేశాల్లో కొత్త వేరియంట్లు బయటపడ్డాయి. వీటి ప్రభావం కొనసాగుతున్న క్రమంలో తొమ్మిది విభిన్న సీక్వెన్సులను పరిశోధకులు గుర్తించారు. కొత్తగా కనుగొన్న వేరియంట్లలో బీఏ 2.86 రకం వైరస్ నీటి ద్వారా వ్యాపిస్తోందని తెలిసినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తాజాగా వెల్లడించడం కలకలం రేపింది.

2 లో

చంద్రమండలంపైనా బీజేపీ మతప్రచారం

- చంద్రయాన్-3 దిగిన స్థలానికి శివశక్తిగా నామకరణం
- ఇస్రో కేంద్రకార్యాలయానికి మోదీ
- శాస్త్రవేత్తలకు అభినందనలు

బెంగళూరు: భూమి చాలక చంద్రమండలాన్ని కూడా మత ప్రచారానికి బీజేపీ వాడుకుంటోంది. ప్రతి దానికి మతాన్ని ఆపాదించే బుద్ధి పోనిచ్చుకోని ప్రధాని మోదీ తాజాగా అంతరిక్ష రంగంలో సాధించిన పురోగతికి మతం రంగు పులిమారు. చంద్రయాన్-3 దిగిన చంద్రుడిపై స్థలానికి 'శివశక్తి' అని పేరు పెట్టారు. మనవాళి సంక్షేమానికి, శక్తికి శివుడు ప్రతీక కాబట్టే ఆ పేరు పెట్టానని వివరణ ఇచ్చుకున్నారు. చంద్రుడిపై శివశక్తి పాయింట్‌తో హిమాలయాల నుంచి కన్యాకుమారి వరకు అనుబంధం ఏర్పడుతుందని చెప్పారు. చంద్రయాన్ అడుగు పెట్టిన ప్రాంతానికి పేరు పెట్టడం శాస్త్రీయ ఆనవాయితీ అని మోదీ తెలిపారు. 2019లో చంద్రయాన్-2 ల్యాండర్ కూలిన ప్రాంతాన్ని 'తిరంగా పాయింట్' అని వ్యవహరించాలని అన్నారు. సాధించాలన్న పట్టుదల ఉంటే విజయం తథ్యమని, ఏ వైఫల్యం శాశ్వతం కాదని నొక్కిచెప్పారు. చంద్రయాన్ విజయవంతమైన చరిత్రాత్మక ఘట్టానికి గుర్తుగా ఏటా ఆగస్టు 23 జాతీయ అంతరిక్ష దినంగా జరుపుకోవాలని ప్రకటించారు. 21వ శతాబ్దం టెక్నాలజీ యుగమని, శాస్త్రీయ సాంకేతిక రంగంలో మరింతగా ముందుకెళ్లేందుకు దోహదమవుతుందని చెప్పారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ నిలవాలన్న కల సాకారానికి

- మిగతా 2 లో

జగన్ జేజమ్మ వచ్చినా అమరావతే రాజధాని

- ఇక్కడ నుంచి ఎవరూ కదిలించలేరు
- రైతుల ఉద్యమం చరిత్రాత్మకం
- సీఎం ఎక్కడున్నా ప్రజలకు ఒరిగేదేం లేదు
- నాలుగేళ్లలో రాష్ట్రం సర్వనాశనం
- వైసీపీని గద్దెదించి ఏపీని కాపాడుకుందాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు
- రైతులను నమ్మించి గొంతుకోసిన జగన్: ముప్పాళ్ల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అన్ని రాజకీయపార్టీలు, ప్రజల మద్దతుతో ఏర్పడిన అమరావతి రాజధానిని జగన్ కాదు...ఆయన జేజమ్మ వచ్చినా ఇక్కడ నుంచి కదిలించలేరని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్పష్టం చేశారు. రాజధాని పోరాటం 29 గ్రామాల రైతులకు సంబంధించిన అంశం కాదని, దీనికి అన్ని రాజకీయపార్టీలు, 26 జిల్లాల ప్రజల మద్దతు ఉందని, దీనిని ఎవరూ ఏమీ చేయలేరని రైతుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. 'రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి' నినాదంతో సీపీఐ ప్రారంభించిన బస్సుయాత్ర శనివారం అమరావతి రాజధాని చేరుకుంది. ఈ సందర్భంగా రాజధాని గ్రామాల్లో రైతులు బస్సుయాత్రకు బ్రహ్మరథం పట్టారు. గ్రామగ్రామానా యాత్ర నిర్వాహకులపై పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. తుళ్లూరు గ్రామంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ రాజధాని రైతుల ఉద్యమాన్ని అణచడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేయని ప్రయత్నమంటూ లేదన్నారు. అయినప్పటికీ రైతులు నాలుగు సంవత్సరాలుగా మొక్కవోని దీక్షతో ఉద్యమం చేస్తున్నారని, వారందరికీ సీపీఐ తరపున విప్లవాభినందనలు తెలియజేస్తున్నానన్నారు. అమరావతి రాజధాని ఏర్పాటుకు ముందు గానీ, తర్వాత గానీ జగన్ ఏనాడూ వ్యతిరేకించలేదన్నారు. పైగా రాజధాని నిర్మాణానికి కనీసం 30 వేల ఎకరాలు కావాలని అసెంబ్లీ సాక్షిగా చెప్పారని గుర్తు చేశారు. 2019 ఎన్నికలకు ముందు అమరావతిలో తాను ఇల్లు, పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసుకుంటున్నట్లు చెప్పి ప్రజలను నమ్మించారన్నారు. వైసీపీ నాయకులంతా తమ అధినేత ఇక్కడే ఇల్లు కట్టుకున్నారని, చంద్రబాబుకి ఇల్లు కూడా ఇక్కడ లేదని విస్తృత ప్రచారం చేశారన్నారు. అధికారం చేతికొచ్చాక జగన్‌మోహన్ రెడ్డి ఒక్కసారిగా అడ్డం తిరిగి అమరావతి విధ్వంసానికి పూనుకున్నారని రామకృష్ణ మండిపడ్డారు. అమరావతితో పాటు పోలవరం, విశాఖ ఉక్కు, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులన్నింటినీ సర్వనాశనం చేశారన్నారు. జగన్ నియంతృత్వ, ప్రజా వ్యతిరేక చర్యలతో 2019లో తెలంగాణ కంటే ఆదాయంలో ముందంజలో ఉన్న ఏపీ... ఇప్పుడు దానికంటే వెనుకబడిపోయిందన్నారు. ఏ ఒక్క రంగంలోనూ ప్రగతి లేదని, రాష్ట్రం అథోగతి పాలైందని, చివరకు కేంద్రం నుంచి మనకు హక్కుగా రావాల్సిన వాటిని కూడా అడగలేని దయనీయస్థితిలో జగన్ ఉన్నారని విమర్శించారు. ఆయన మాత్రం దేశంలోనే అత్యంత ధనిక సీఎంగా రికార్డుకెక్కారని గుర్తుచేశారు. పైకి మాత్రం పేదలకు, పెత్తందార్లకు మధ్య పోటీ జరుగుతుందని బొంకుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. అక్టోబరులో రిషికొండ వెళతానని అంటున్నారని, వాస్తవానికి ఆయన తాడేపల్లిలో ఉన్నా, రిషికొండపై ఉన్నా, ఇడుపులపాయలో ఉన్నా ప్రజలకు ఒరిగేదేమీ లేదని రామకృష్ణ ఎద్దేవా చేశారు. అధికారపార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలే సగం

- మిగతా 2 లో

ఇక సూర్యుడిపైకి...

2న ఆదిత్య ఎల్1 ప్రయోగం: ఇస్రో

బెంగళూరు: చంద్రయాన్-3 మిషన్ విజయంతో భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) తన దృష్టిని సూర్యుడిపై కేంద్రీకరించింది. సూర్యుడిపై పరిశోధనలకు ఆదిత్య ఎల్1 వ్యోమనౌకను సెప్టెంబరు 2న ప్రయోగించనుంది. సౌర వాతావరణాన్ని అధ్యయనం చేసేందుకు భూమికి 1.5మిలియన్ కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్1 (సూర్యుడు-భూమి లాగ్రాంజియన్ పాయింట్)పై పరిశోధనల కోసం ఆదిత్య-ఎల్1 మిషన్‌కు శ్రీకారం చుట్టబోతున్నట్లు ఇస్రో ప్రకటించింది. అంతరిక్ష పరిశోధనా కేంద్రానికి చెందిన బెంగళూరు కేంద్రకార్యాలయం నుంచి ప్రయోగించే మొట్టమొదటి సౌర మిషన్ ఇదేనని తెలిపింది. ఎల్1 చుట్టూ కక్ష్య నుంచి సూర్యుడిపై పరిశోధనలను చేపట్టడమే

- మిగతా 2 లో

గవర్నరు బెదిరింపులకు భయపడం

- పంజాబీల సహనాన్ని పరీక్షించవద్దు
- బీజేపీ యేతర రాష్ట్రాలపై ఎందుకీ వివక్ష
- పంజాబ్ సీఎం భగవంత్ మాన్

చండీగఢ్: గవర్నరు బన్వరిలాల్ పురోహిత్ బెదిరింపులపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ శనివారం ఘాటుగా స్పందించారు. గవర్నరు బెదిరింపులకు తల వంచేది లేదని స్పష్టంచేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో శాంతిభద్రతల గురించి అక్కడి గవర్నర్లు ఎందుకు మౌనం వహిస్తున్నారని

- మిగతా 2 లో

ఆగిన రైలులో పేలిన సిలిండర్

తొమ్మిది మంది దుర్మరణం

- మరో 20 మందికి గాయాలు
- తమిళనాడులో దుర్ఘటన
- రూ.10లక్షల పరిహారం ప్రకటించిన రైల్వే

మధురై: తమిళనాడులోని మదురై రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న రైలులో అగ్నిప్రమాదం జరిగింది. శనివారం తెల్లవారుజామున 5.15 గంటలప్పుడు సిలిండర్ పేలి నలుగురు మహిళలు సహా తొమ్మిది మంది దుర్మరణం చెందారు. మరో 20 మందికి గాయాలయ్యాయి. ఎవరో అక్రమంగా గ్యాస్ సిలిండర్‌ను తీసుకొచ్చి టీ పెట్టేందుకు ప్రయత్నించగా సిలిండర్ పేలిపోవడంతో దుర్ఘటన సంభవించినట్లు రైల్వే ప్రకటన తెలిపింది. పేలుడు సంభవించిన అరగంటకు అగ్నిమాపక దళం చేరుకోగా ఉదయం 7.15గంటలకు మంటలను ఆర్పగలిగినట్లు పేర్కొంది. ప్రైవేట్ పార్టీ కోచ్‌లో ఈ ఘటన జరిగిందని దక్షిణ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి తెలిపారు. అక్కడ చెల్లా చెదురుగా పడివున్న సామాన్లలో కూరగాయలు, వంటపాత్రలు ఉండటంతో వంట చేసే ప్రయత్నం జరిగినట్లు చెప్పగలమన్నారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగినప్పుడు బోగీలో 65 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఘటనపై రైల్వే భద్రతా కమిషన్ ఆదివారం దర్యాప్తు చేయనున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. ఈ కోచ్ 17వ తేదీన ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నుంచి ప్రయాణాన్ని ప్రారంభించింది. షెడ్యూల్ ప్రకారం ఆదివారం చెన్నై చేరుకోవాలి. శుక్రవారం నాగర్‌కోయిల్ జంక్షన్ వద్ద పునలూరు-మదురై ఎక్స్‌ప్రెస్ రైలుకు దీనిని అటాచ్ చేయగా అదేరోజు రాత్రి మదురై స్టేషన్ వద్ద డిటాచ్ చేసి స్టాబ్లింగ్ లైన్‌లో ఉంచారు. ప్రైవేటు కోచ్‌ను ఎవరైనా బుక్ చేసుకోవచ్చని అధికారులు చెప్పారు.

ఎటు చూసినా మంటలే...

ఎటు చూసినా మంటలే కనిపించాయి. హాహాకారానికి నిద్రలో ఉన్న వారంతా ఉలిక్కిపడి లేచారని బాధితురాలు అల్కా ప్రజాపతి తెలిపారు. 'మేమంతా నిద్రలో ఉన్నాం. బిగ్గరగా కేకలు వినిపించడంతో లేచిచూస్తే మంటలు కనిపించాయి. తలుపు బిగించి ఉండటంతో వెంటనే తప్పించుకోలేకపోయాం. ఎవరో తలుపు తెరిచారు. దాంతో బయటకు వచ్చి ప్రాణాలను కాపాడుకున్నాం. దట్టమైన పొగ కమ్మేయడంతో ఊపిరి సరిగ్గా అందలేదు' అని అన్నారు. ఘటన

- మిగతా 2 లో

ఇదీ లోకం!

చూశారా మా ప్రభుత్వ హయాంలో సినిమా తారలకు జాతీయ అవార్డులు కూడా వొచ్చాయి!

పాఠాలు బోధిస్తుంది ఈ వంటశాలలోనే

వంటశాలలో విద్యాబోధన

నాడు-నేడు నిధులు రాక ఆగిన పనులు

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే విద్యాలయాలు సర్వాంగ సుందరంగా ఉండాలని భావించిన ప్రభుత్వం నాడు నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రూపొందిస్తోంది. అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నది. అయితే ప్రభుత్వ ఆశయాలకు, ఆకాంక్షలకు క్షేత్రస్థాయిలో న్యాయం జరగడం లేదు. పాలకుడి ఆశయం ఎంత గొప్పదైనా...ఆ ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లేవారికి అదే సంకల్పం ఉండాలి. కానీ క్షేత్రస్థాయిలో ఆ సంకల్పానికి చెద పట్టింది. నిధుల కొరత ఉందో...ఒక టీచరు, ఐదుగురు విద్యార్థులు గల పాఠశాల మరమ్మతులకు అంత తొందరెందుకు అనుకున్నారో గానీ...నాడు-నేడు కింద పాఠశాల మరమ్మతులకు అంచనా వేసిన రూ.11.75 లక్షల్లో కేవలం నాలుగు లక్షలు మాత్రమే మంజూరు చేసిన విద్యాశాఖ అధికారులు మరమ్మతు పనులను అసంపూర్తిగా వదిలేశారు. అనకాపల్లి జిల్లా

- మిగతా 2 లో

బీజేపీ హానికర చర్యలతోనే మణిపూర్‌లో హింస

అనీ రాజా

2 లో

చర్చిలపై దాడులు తగవు

పాక్ కమ్యూనిస్ట్ పార్టీ

లాహోర్: క్రైస్తవ సమాజానికి చెందిన చర్చిలు, గృహాలు, ఆస్తులపై జరిగిన దాడులను పాకిస్తాన్ కమ్యూనిస్ట్ పార్టీ సెక్రటరీ జనరల్, పాపులర్ లెఫ్ట్ అలయన్స్ (లెఫ్ట్ పార్టీల అలయన్స్) కన్వీనర్, ఇమ్దాద్ ఖాజీ జరన్‌వాలాలో తీవ్రంగా ఖండించారు. పాక్ మొత్తం జనాభాలో క్రైస్తవులు దాదాపు 2శాతం మంది ఉన్నారు. ఈ దాడుల్లో క్రైస్తవులకు చెందిన దుకాణాలు, ఇళ్లతోపాటు కనీసం నాలుగు చర్చిలు దగ్ధం చేసారు. సమీపంలోని ముస్లిం మసీదుల ద్వారా బహిరంగంగా ప్రకటించిన బెదిరింపుల కారణంగా, పిల్లలు, మహిళలు, వృద్ధ క్రైస్తవ సంఘం సభ్యులు తమ ఇళ్లను ఖాళీ చేయవలసి వచ్చింది, అన్నింటిని వదిలి సురక్షిత ప్రాంతాలకు పారిపోయి వారి ప్రాణాలను కాపాడుకున్నారు. పర్యవసానంగా, వారు రాత్రంతా నిస్సహాయంగా బహిరంగ ప్రదేశాల్లో శివార్లలోని కమ్యూనిటీల్లో కాలం గడిపారు. వారు ఇప్పటికీ ప్రాణభయంతో తిరిగి రాలేకపోతున్నారు. పాకిస్థాన్‌లో దైవదూషణ చట్టాలు ఉన్నందున, ఏదైనా సంఘటన జరిగితే దోషులను చట్ట ప్రకారం విచారించాల్సిఉంది. అయితే ముస్లిం-మెజారిటీ ఉన్న పాకిస్తాన్‌లో దైవదూషణ ఆరోపణలపై ఇస్లామిస్ట్ మితవాద నాయకులు, రాజకీయ పార్టీల పూర్తి మద్దతు ఉంది, అహ్మదీ కమ్యూనిటీతో సహా పాకిస్తాన్‌లోని ముస్లిమేతర కమ్యూనిటీలకు వ్యతిరేకంగా జరుగుతున్న దాడులపై ప్రభుత్వం, చట్టాన్ని అమలుచేసే ఏజెన్సీలు కేవలం నిమిత్త మాత్రంగానే ఉంటాయి. గణనీయమైన నష్టం జరిగినప్పుడు మాత్రమే చర్యలు తీసుకుంటాయి. పాకిస్థాన్‌లోని మతపరమైన మైనారిటీలను రక్షించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

విభిన్న విశ్వాసాలకు అతీతంగా ఒకే ఇస్లామిక్ విశ్వాసంతో కూడిన మత ఆధారిత వైరుధ్యాలకు పాకిస్తాన్ నిలయంగా మారింది. ఈ వైరుధ్యాలు పాకిస్తాన్ సమాజానికి గణనీయమైన నష్టాన్ని కలిగించడమే కాకుండా ప్రాంతీయంగా కూడా పెనుప్రభావం చూపుతోంది. ముస్లింలు, క్రైస్తవులు, హిందువులు మధ్య విభేదాలు సృష్టించడానికి, షియా-సున్నీ విభజనలను తీవ్రతరం చేయడానికి, మతపరమైన విభేదాల ఆధారంగా పాక్‌లో ఘోరంగా హింసాత్మక చర్యలు జరుగుతున్నాయి. రాజకీయాలు, మతపరమైన విభజనలు, మతపరమైన విశ్వాసాలు, భాషా, జాతి విభజనలు, ద్వేషంతో పాతుకుపోయిన పాకిస్తాన్ రాజ్యాంగం, చట్టాలు, విద్యా వ్యవస్థ పౌరులందరికీ సమాన హక్కులు, హోదాను నిర్ధారించే లౌకిక, ఆధునిక శాస్త్రీయ పునాదులపై ఆధారపడినంత వరకు పాక్‌లో వివక్ష, భయంకరమైన, ద్వేషపూరిత మానవ సంక్షోభం కొనసాగుతుంది.

నీటి ద్వారా కోవిడ్ వ్యాప్తి



జెనీవా: కోవిడ్ దశలవారీ విజృంభణ యావత్ ప్రపంచాన్ని గడగడలాడిస్తూనే ఉంది. ఇటీవల యూరప్, ఆఫ్రికా, అమెరికా దేశాల్లో కొత్త వేరియంట్లు బయటపడ్డాయి. వీటి ప్రభావం కొనసాగుతున్న క్రమంలో తొమ్మిది విభిన్న స్వీకన్సులను పరిశోధకులు గుర్తించారు. కొత్తగా కనుగొన్న వేరియంట్లలో బీఏ 2.86 రకం వైరస్ నీటి ద్వారా వ్యాపిస్తోందని తెలిసినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తాజాగా వెల్లడించడం కలకలం రేపింది. ఈ వేరియంట్‌పై పూర్తిస్థాయి పరిశీలన జరుగుతుండగా అప్రమత్తత అనివార్యమని శాస్త్రవేత్తలు, నిపుణులు హెచ్చరికలు చేశారు. ఆసియా దేశాలతో పాటు థాయిలాండ్‌లో కోవిడ్ కేసులు పెరుగుతున్నాయని సమాచారం. గత నెలలో 1,366 కొత్త కేసులు ఆయా దేశాల్లో నమోదు కాగా భారత్‌లో 1,335, బంగ్లాదేశ్‌లో 1,188 కొత్త కేసులు నమోదైనట్లు సమాచారం. ప్రస్తుతానికి ఎక్స్‌బీబీ.1.16, ఈజీ.5 వేరియంట్‌లు ప్రపంచంలో ఎక్కువగా వ్యాపించాయి. ఎక్స్‌బీబీ.1.16 మొత్తం 106 దేశాలలో, ఈజీ.5 మొత్తం 53 దేశాలలో ఉంది. ప్రపంచంలోని 11శాతం దేశాలు మాత్రమే డేటాను షేర్ చేయగా, 44శాతం దేశాలు డేటాను పంచుకోవడం ప్రారంభించాయని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది. 234కుగాను 103 దేశాలు డేటాను షేర్ చేశాయని, గత నెలలో ప్రతి దేశం నుంచి సగటున ఒక కరోనా కేసు నమోదైందని వెల్లడించింది. అందిన సమాచారం మేరకు ప్రపంచంలో కోవిడ్ పాజిటివిటీ రేటు ఎనిమిది శాంగా ఉన్నట్లు పేర్కొంది. కొరియా, ఆస్ట్రేలియా, బ్రిటన్, ఇటలీ దేశాల్లో అత్యధిక కేసులు నమోదవుతున్నాయి. 234 దేశాలలో, 49,380 మంది రోగులు ఆసుపత్రులలో చేరారు. 22 దేశాల్లో 646 మంది ఐసీయూలో ఉంటే గతనెలలో 23శాతం మంది ఆసుపత్రి పాలైనట్లు అధికారిక డేటా తెలిపింది.

భారత్‌లో జీ20 సదస్సుకు పుతిన్ రావడం లేదు

మాస్కో: భారత్‌లో వచ్చేనెల 9,10 తేదీల్లో దిల్లీలో జరగబోయే జీ20 దేశాధినేతల సదస్సుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రావడం లేదని క్రెమ్లిన్ ప్రకటించింది. అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ ఈమేరకు ప్రకటన చేశారు. భారత్‌లో జరిగే జీ20 సమావేశాలకు పుతిన్ రావడం లేదని, వర్చువల్‌గా పుతిన్ పాల్గొంటారా లేదా అనేది నిర్ణయించలేదని పెస్కోవ్ చెప్పారు. రష్యా దృష్టి మొత్తం ఉక్రెయిన్‌పై సైనిక చర్యపైనే ఉందని పేర్కొన్నారు.

దక్షిణాఫ్రికాలోని జొహనెస్‌బర్గ్‌లో నిర్వహించిన బ్రిక్స్ సదస్సు కూడా పుతిన్ హాజరు కాలేదు. ఆయన స్థానంలో రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ బ్రిక్స్ సమావేశాలకు హాజరయ్యారు. పుతిన్ విదేశాల్లో పర్యటించకపోవడం, బ్రిక్స్, జీ 20 లాంటి ప్రతిష్ఠాత్మక సదస్సులకు గైర్హాజరు కావడంపై ఊహాగానాలు ఉన్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యను ప్రారంభించి ఏడాదిన్నర దాటిన క్రమంలోనే పుతిన్‌పై అనేక కేసులు నమోదయ్యాయి. మార్చిలో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు పుతిన్‌పై అరెస్టు వారెంట్ జారీ చేసింది. దీంతో విదేశాలకు వెళితే అరెస్టు చేస్తారనే భయంతోనే ఆయన ఎక్కడకు వెళ్లడం లేదన్న వాదన వినిపిస్తోంది.

ఐఎస్ఎస్‌కు నాసా స్పేస్ ఎక్స్ క్రూ-7 మిషన్

వాషింగ్టన్: డ్రాగన్ వ్యోమనౌక 'ఎండీవర్'తో కూడిన స్పేస్ ఎక్స్ క్రూ-7 మిషన్‌కు నాసా శ్రీకారం చుట్టింది. శనివారం తెల్లవారుజామున 3.27 గంటలకు (స్థానిక కాలమానం) మిషన్‌ను అంతరత్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు పంపింది. ఈనెల 15న మిషన్‌ను చేపట్టాల్సి ఉండగా అనేక కారణాలతో చాలా సార్లు ప్రయోగాన్ని నాసా వాయిదా వేసింది. క్రూ-7 మిషన్‌లో నాసా వ్యోమగామి జాస్మిన్ మొఘ్‌బెలి, యూరోపియన్ అంతరిక్ష కేంద్రానికి చెందిన వ్యోమగామి ఆండ్రియాస్ మొర్గేసెన్, జాపాన్ ఎయిరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీ నుంచి సంతోషి పురుకావా, రాస్‌కాస్మోస్ కాస్మోనాట్ కాన్స్టాంటిన్ బొరిసోవ్ అంతరిక్షంలోకి వెళ్లినట్లు నాసా ప్రకటించింది.

అసంపూర్తిగా పాఠశాల భవనం

వంటశాలలో విద్యాబోధన

(మొదటిపేజీ తరువాయి)

కసింకోట మండలం బయ్యవరం పంచాయతీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మరమ్మతు పనులు నిలిచిపోయాయి. ఈ పాఠశాలలో 1,2 తరగతులు చదువుతున్న ఐదుగురు విద్యార్థులు, ఒక టీచరు మాత్రమే ఉన్నారు. ఈ పాఠశాల కోసం ఏడాది క్రితం నాడు-నేడు కింద రూ.11.75 లక్షలు కేటాయించారు. మొదటి విడతలో నాలుగు లక్షలు మంజూరు కాగా పనులు ప్రారంభించారు. మిగిలిన రూ.7.75 లక్షలు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో పాఠశాలకు సంబంధించిన వంటశాలలోనే పాఠాలు బోధిస్తున్నారు. అంతేకాకుండా పాఠశాల మరమ్మతుల కోసం అక్కడి కుర్చీలు, టేబుళ్లు తదితర సామాగ్రిని తొలగించారు. పాఠశాల మరమ్మతులు పూర్తిస్థాయిలో జరగలేదు. దీంతో ఏడాదిగా వంటశాలలోనే పాఠాలు బోధిస్తున్నారు. దీనిపై స్థానిక విద్యాశాఖ అధికారులను సంప్రదించగా నిధులు కొరత కారణంగానే పనులు నిలిచిపోయాయని చెప్పడం విశేషం. ఏదేమైనా ప్రభుత్వ ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు జరగలేదనేది స్పష్టమవుతోంది.

గవర్నరు బెదిరింపులకు భయపడం

(మొదటిపేజీ తరువాయి)

సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేస్తానని గవర్నరు బెదిరించడాన్ని సీఎం మాన్ కొట్టిపారేశారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని బెదిరించే అధికారం కేంద్రం ఎంపిక చేసిన గవర్నర్లకు లేదని, పురోహిత్ గాండ్రింపులకు భయపడేది లేదని తేల్చిచెప్పారు. భగవంత్‌మాన్ ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గవర్నర్లు కేంద్రం చేతిలో కీలుబొమ్మలని విమర్శించారు. ఢిల్లీ, పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు, తెలంగాణ వంటి బీజేపీ యేతర పాలిత రాష్ట్రాల పాలనలో అడ్డంకులు సృష్టించడం ద్వారా కేంద్రానికి తొత్తులుగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి చర్యలు దేశ సమాఖ్య స్ఫూర్తికి ఎంతమాత్రం మంచి చేయవని హితవు పలికారు. 'ఆర్టికల్ 356 కారణంగా గతంలో పంజాబ్‌పై తీవ్ర ప్రభావం పడింది. అందువల్ల మా గాయాలపై ఉప్పు చల్లొద్దు. గవర్నరు గారూ...పంజాబీల సహనం, భావోద్వేగాలను పరీక్షించవద్దు' అని మాన్ సుతిమెత్తగా హెచ్చరించారు. తన అధికారాలను లెక్క చేయకుండా తాను రాసిన లేఖలకు సీఎం మాన్ స్పందించడం లేదని గవర్నరు నిన్న ఆరోపించారు. తన లేఖలకు సమాధానం చెప్పకపోతే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేస్తానని, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని బెదిరించారు. దీనికి మాన్ స్పందిస్తూ గవర్నరు 16 లేఖలు రాశారని, అందులో 9 లేఖలకు సమాధానం పంపామని, మిగిలిన లేఖలను పరిశీలిస్తున్నామని వివరించారు. మిగిలిన లేఖలకు సమాధానాలు సిద్ధమయ్యాయని, రానున్న రోజుల్లో పంపుతామన్నారు. కొన్ని లేఖలకు పూర్తిస్థాయి సమాచారం సేకరిస్తున్నామని, అందుకు కొంత సమయం పడుతుందని చెప్పారు. గవర్నరు రాసిన లేఖల సారాంశాన్ని పరిశీలిస్తే ఆయన అధికార దాహం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. బహుశా పురోహిత్‌కు రాజకీయాలపై ఆసక్తి అధికంగా ఉన్నట్లు తెలుస్తోందని, త్వరలో ఎన్నికలు జరగనున్న రాజస్తాన్‌లో బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థి కావాలని ఆయన కోరుకుంటున్నట్లు ఉందని ఆరోపించారు. అందుకే అధికారం చేతికి తీసుకొని ఆదేశాలు ఇస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రపతి పాలన విధిస్తామన్న గవర్నరు బెదిరింపులు తనను, పంజాబీలను భయపెట్టలేవని మాన్ స్పష్టంచేశారు. పంజాబ్ ప్రజలను, రాష్ట్రంలోని శాంతికాముకులను గవర్నరు బెదిరించినట్లు ఉందన్నారు. గవర్నరు వ్యాఖ్యలను రాజ్యాంగ వ్యతిరేకమైనవిగా పరిగణిస్తున్నామని ఆయన చెప్పారు. మాదక ద్రవ్యాలను అంతం చేయడానికి తమ ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకుంటుందని, స్మగ్లర్ల ఆస్తులపై దాడులు చేస్తున్నామని, గ్యాంగ్‌స్టర్లపై ఉక్కుపాదం మోపేందుకు ప్రత్యేకించి టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేశామని మాన్ వివరించారు. అయినా రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగాలేదని చెబుతున్నారని ఆరోపించారు. 'నేను గవర్నరు పురోహిత్‌ను అడుగుతున్నాను. నూహ్‌లో జరిగిన పరిణామాలపై హరియాణా ముఖ్యమంత్రి ఖట్టర్‌కు ఆ రాష్ట్ర గవర్నరు ఇలాగే నోటీసు ఇచ్చారా? నూహ్‌లో మత ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పెద్దఎత్తున హింస చెలరేగింది. కర్ఫ్యూ విధించారు. అయినా అక్కడి గవర్నరు సీఎంకు ఎందుకు నోటీసులు ఇవ్వలేదు. ఖట్టర్‌కు హరియాణా గవర్నరు ఒక్క లేఖ అయినా రాశారా? రాయలేదు. ఎందుకంటే కేంద్రంలోనూ వారి ప్రభుత్వమే ఉంది' అని మాన్ చెప్పారు. పంజాబ్‌లో శాంతిభద్రతల గురించి ఆందోళన చెందుతున్న గవర్నరు పురోహిత్...హింసతో అట్టుడుకుతున్న మణిపూర్‌పై ఒక్క ప్రకటనైనా చేశారా అని ప్రశ్నించారు. మణిపూర్‌కే రాజ్యాంగం వర్తించదా అని నిలదీశారు. ఉత్తరప్రదేశ్‌లో స్వయానా జర్నలిస్టుల సమక్షంలోనే హత్య జరిగిందని, అక్కడ శాంతిభద్రతలను ప్రశ్నిస్తూ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు లేఖ రాసే ధైర్యం యూపీ గవర్నరుకు ఉందా అని ప్రశ్నించారు. ఆ ఏడాది ఏప్రిల్‌లోనే రాజకీయ నేతగా మారిన మాఫియా డాన్ అతిక్ అహ్మద్‌ను కాల్చి చంపితే ఏమి చేశారన్నారు. పంజాబ్, ఢిల్లీ, కర్నాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ మినహా ఇతర రాష్ట్రాల్లో గవర్నర్ల పేర్లు అక్కడికి ప్రజలకు తెలియదని వివరించారు. బీజేపీ యేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల గవర్నర్ల పేర్లే ప్రజలకు తెలుస్తున్నాయని చెప్పారు. ఆరు బిల్లులు...అందులో రెండు బిల్లులు అమరీందర్‌సింగ్ ప్రభుత్వ కాలం నాటివి గవర్నరు ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాయని, తన లేఖలకు వెంటనే స్పందించడం లేదని బాధపడుతున్న గవర్నరు పురోహిత్...తాము పంపిన బిల్లులపై ఎందుకు శ్రద్ధ తీసుకోవడం లేదని మాన్ ప్రశ్నించారు.

బీజేపీ హానికర చర్యలతోనే

మణిపూర్‌లో హింస

విశాలాంధ్ర-హైదరాబాద్ : బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ హానికరమైన, ప్రతీకార, విభజన విషరాజకీయాల చర్యలతోనే మణిపూర్‌లో హింస చెలరేగుతోందని, ఇది కచ్చితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాయోజిత హింసగా భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి అనీ రాజా పేర్కొన్నారు. ఇక్కడి ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర కార్యాలయంలో శనివారం భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ఉస్తెల సృజన అధ్యక్షతన జరిగింది. అనీరాజా ప్రసంగం కొనసాగిస్తూ, మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వం ప్రజల ప్రజాస్వామిక హక్కులను అణిచివేసే ప్రయత్నం చేస్తూ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య చిచ్చుపెట్టి హింసాకాండ ప్రోత్సహిస్తున్నదన్నారు. దాదాపు నాలుగు నెలలుగా కొనసాగుతున్న హింసను అరికట్టడంలో పూర్తిగా విఫలమైందని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం మణిపూర్‌లోని అసమర్థ బీజేపీ సర్కార్‌ను బర్తరఫ్ చేయాలనీ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో హింస కారణంగా భారీ ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని, పరిస్థితి అధ్వాన్నంగా మరి సహాయక శిబిరాల్లో మహిళలు, పిల్లలు కనీస సౌకర్యాలు కరువై విలవిలలాడుతున్నారని చెప్పారు. తన నేతృత్వంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నిజనిర్ధారణ బృందం మణిపూర్ హింస ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తే తమపై మణిపూర్ పోలీసులు దేశద్రోహం కేసులు నమోదు చేశారని, విమర్శలను, ప్రసంగం చేసే హక్కును కూడా మణిపూర్ ప్రభుత్వం అణిచివేసేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. దేశద్రోహం కేసులు నమోదు చేస్తే బెదిరేదిలేదని, న్యాయపరంగా ఉద్యమిస్తామని అనీరాజా హెచ్చరించారు. బీజేపీ లాంటి మనువాద శక్తులు తమ విభజన, ప్రజా వ్యతిరేక విధానాలతో సమాజంలో చీలికలను తీసుకవస్తున్నాయని, వీటిని ప్రజాస్వామ్య, ప్రగతిశీల, లౌకిక శక్తులు అడ్డుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ కార్యదర్శి కె.రజని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి, సహాయ కార్యదర్శి ముడుపు నలిని రెడ్డి ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయాదేవి. సహాయ కార్యదర్శి ఫైమిద, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి జంగమ్మ, కార్యవర్గ సభ్యులు మంచల రమాదేవి, మామిండ్ల సాంబలక్ష్మి, గిరిజ రాహేలా, మంజుల, రమ, పద్మ తదితరులు పాల్గొన్నారు

మహారాష్ట్రలో మాదకద్రవ్యాల పట్టివేత

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహారాష్ట్రలోని పూనేలో భారీగా మాదవద్రవ్యాలు పట్టుబడ్డాయి. ఈ ఘటనకు సంబంధించి ఐదుగురిని అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో తెలంగాణకు చెందిన వారు కూడా ఉన్నారు. వీరి వద్ద నుంచి 101 కిలోల మెథాక్వాలోన్‌ను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.51 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. హైదరాబాద్ టూ పూణే జాతీయ రహదారిపై మాటు వేసి, ఈ ముఠాను డీఆర్ఐ బృందం పట్టుకుంది. తెలంగాణ, మహారాష్ట్ర, ఢిల్లీ, హరియాణాకు చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు వారు తెలిపారు. తెలంగాణలో ఎక్కడ నుంచి మాదకద్రవ్యాలను తీసుకుని వస్తున్నారనే దానిపై విచారణ చేపట్టారు. పట్టుబడ్డ నిందితులు మాదకద్రవ్యాలను వివిధ రాష్ట్రాలలో విక్రయిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో తెలంగాణలో డ్రగ్స్ తయారీ కేంద్రంపై దాడులు చేసే అవకాశం ఉంది. అయితే డ్రగ్స్‌పై నిందితులు నోరు విప్పకపోవడంతో అధికారుల బృందం తమదైన శైలిలో కూపీ లాగుతోంది.

గెలుపుపై టీడీపీలో అపనమ్మకం

ఎంపీ విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో గ్యారంటీగా గెలుస్తామనే ధీమా తెలుగుదేశం పార్టీలో ఏ ఒక్కరికీ లేదని రాజ్యసభ సభ్యులు, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి అన్నారు. వివిధ అంశాలపై శనివారం ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. రాజకీయాల్లో విజేతలు, హుందాగా ఉండే వారి మాటలకే సమాజంలో గౌరవం ఉంటుందన్నారు. పరాజితులు, ఒకప్పటి రౌడీ షీటర్లు, చిల్లర నేరగాళ్లు వార్నింగులిస్తే వీధి కుక్కలు కూడా భయపడబోవు అని పరోక్షంగా టీడీపీకి చురకలు అంటించారు. టీడీపీ అనుకూల మీడియా... ఏ జాతీయ సంస్థ సర్వే వచ్చినా అది ఫేక్, పెయిడ్ అంటూ సొంత కథనాలు ప్రచారం చేసుకుంటోందని చెప్పారు. ఇటీవల ఇండియా టుడే ఇచ్చిన సర్వే మాత్రం అసలు సిసలు సర్వే అంటూ ప్రచారం చేసుకుంటోందని ఎద్దేవా చేశారు. ప్రజా ప్రయోజనాలు, సంక్షేమమే లక్ష్యంగా వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పనిచేయాలని ఆయన అన్నారు. ఈ వ్యవస్థలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అందిస్తూ ప్రభుత్వానికి సహాయపడాలని విజయసాయి రెడ్డి అన్నారు.

ఆగిన రైలులో పేలిన సిలిండర్

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన 15-20 నిమిషాలకు రైల్వే ఉద్యోగులు వచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారని, కోచ్ మొత్తం అగ్నికీలంలా కనిపించిందన్నారు. ప్రమాదం నుంచి తప్పించుకున్న మరికొందరు మాట్లాడుతూ తామంతా రమేశ్వరానికి పయనమైనట్లు చెప్పారు. స్లీపర్ కోచ్ కావడంతో లోపల చిక్కుకున్న వారు వెంటనే బయటకు రాలేకపోయారని, ప్రాణ నష్టానికి ఇది కూడా ఓ కారణమని ప్రత్యేక్ష సాక్షి ఒకరు అన్నారు.

తమిళనాడు, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాల ఎక్స్‌గ్రేషియా

ఈ ఘటనపై రైల్వేశాఖ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించింది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రూ.3లక్షలు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రూ.2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

రాష్ట్రపతి, యూపీ, బెంగాల్ సీఎంల దిగ్భ్రాంతి

ఈ ఘటనపై రాష్ట్రపతి ముర్ము, తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతులకు సంతాపాన్ని ప్రకటించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. 'మధురై జంక్షన్ వద్ద ఆగివున్న రైలులో అగ్ని ప్రమాదం జరిగి ప్రాణనష్టం జరగడం కలచివేసింది. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా' అని ముర్ము ట్వీట్ చేశారు. తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రులు ఎంకే స్టాలిన్, యోగి ఆదిత్యనాథ్, మమతా బెనర్జీ సంతాపాన్ని ప్రకటించారు. రామేశ్వరానికి వెళ్లే యాత్రికులు ఇలా ప్రమాదానికి గురికావడం బాధాకరమని స్టాలిన్ అన్నారు. తక్షణమే ఘటనాస్థలానికి వెళ్లాలని మధురై కలెక్టర్ సంగీతను ఆదేశించినట్లు చెప్పారు. మృతదేహాలను స్వస్థలాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

రేగడ గూడూరులో అతిసార

16 మందికి అస్వస్థత

విశాలాంధ్ర -వెలుగోడు: మండల పరిధిలోని రేగడ గూడూరు గ్రామంలో అతిసార ప్రబలింది. శనివారం తొమ్మిది మందికి అతిసార వ్యాధి సోకడంతో మొత్తం వ్యాధి గ్రస్తులు సంఖ్య 16 కు చేరిందని ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ఆదేశాల మేరకు గ్రామంలో అత్యవసర మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. అతి సార వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలను అందజేస్తూ వ్యాధి నివారణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ డిపార్ట్‌మెంట్ వారితో సమయమనం చేసుకుంటూ గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతూ ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది సహకారంతో నీటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ రేగడ గూడూరు గ్రామాన్ని సందర్శించి, అది సార వ్యాధిగ్రస్తులకు అత్యవసర మెడికల్ క్యాంపులో అందిస్తున్న వైద్య సేవలు గురించి తెలుసుకొని సంతృప్తి చెందారు. రేగడ గూడూరు గ్రామంలో అతిసార వ్యాధి పూర్తి నివారణ జరిగే వరకు మెడికల్ క్యాంపు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణను వ్యాధిగ్రస్తులను పూర్తిస్థాయిలో గుర్తించి వారికి వైద్య సేవలను అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. ప్రస్తుతం అతిసార అదుపులో రావడంతో శనివారం ఏడు మంది బాధితులు మెడికల్ క్యాంపు నుంచి డిశ్చార్జ్ అయ్యారు. అనంతరం డాక్టర్ వెంకటరమణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వేల్పనూరు సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. ఆస్పత్రి ప్రసవాలు పెంచాలని సిబ్బందిని ఆదేశించారు, తర్వాత ఆయన...నిర్మాణంలో ఆస్పత్రి భవనాన్ని తనిఖీ చేస్తూ త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తి చేయాలని భవన నిర్మాణ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కాంతారావు నాయక్, డాక్టర్ జహీర్ వలి, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, ఎంపీహెచ్ఏ ఫకీర్ భాష, మాధవీలత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఇక సూర్యుడిపైకి...

(మొదటిపేజీ తరువాయి)

ఆదిత్య-ఎల్1 మిషన్ లక్ష్యం. ఫోటోస్పియర్, క్రోమోస్పియర్‌తో పాటు సూర్యుడి బయట పొరలు, కొరోన, వివిధ వేవ్‌బ్యాండ్ల పరిశోధనల కోసం ఏడు పేలోడ్‌లను వ్యోమనౌక మోసుకెళ్లనుంది. ఇది పూర్తిగా దేశీయ మిషన్. విజిబుల్ ఎమిషన్ లైన్ కొరోనోగ్రఫీ పేలోడ్ తయారీకి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ) సారథ్యం వహించగా సోలార్ అల్ట్రావైలెట్ ఇమేజ్ పేలోడ్‌ను ఆస్ట్రానమీ, ఆస్ట్రోఫిజిక్స్ ఇంటర్-యూనివర్సిటీ సెంటర్, పూనే తయారు చేసింది. లాగ్రాంజియన్ పాయింట్ 1 (ఎల్ 1) చుట్టూ ఉన్న కక్ష్యలో ఈ వ్యోమనౌకను ప్రవేశ పెట్టనున్నారు. పేలోడ్లలో ప్రధానమైన 'విజిబుల్ ఎమిషన్ లైన్ కొరోనోగ్రఫీ (వీఈఎల్‌సీ)తో పాటు సోలార్ అల్ట్రావైలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్, ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పెరిమెంట్, ప్లాస్మా అనలైజర్ ప్యాకేజ్ ఫర్ ఆదిత్య, సోలార్ ఎనర్జీ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్, హైఎనర్జీ ఎల్-1 ఆర్బిటింగ్ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్, మ్యాగ్నెటోమీటర్' ఉన్నాయి. సూర్యకాంతిపై అధ్యయనానికి ఈ పేలోడ్‌లు అనుకూలంగా తయారయ్యాయి. ఎల్-1కి ఉన్న సానుకూలత దృష్ట్యా నాలుగు పరికరాలు సూర్యుడిని, మిగతా మూడు సౌర రేణువులు, అయస్కాంత క్షేత్రాలపై అధ్యయనం చేస్తాయి. కొరోనల్ హీటింగ్, కొరోనల్ మాస్ ఎజెక్షన్, ప్రీ ఫ్లేర్, అంతరిక్ష వాతావరణం, రేణువులు, క్షేత్రాలు తదితరాలకు సంబంధించిన సమస్యలను అర్థం చేసుకునేందుకు అవసరమైన కీలక సమాచారాన్ని ఆదిత్య ఎల్ పేలోడ్‌లు సేకరించగలవని ఇస్రో తెలిపింది. ఆదిత్య ఎల్1 పరికరాలు సౌర వాతావరణాన్ని ముఖ్యంగా కొరోనా, క్రోమోస్పియర్‌పై అధ్యయనం చేస్తాయని, ఇన్ సిటూ పరికరాలు ఎల్ 1 వద్ద వాతావరణాన్ని అధ్యయనం చేస్తాయని తెలిపింది.

అమరావతే రాజధాని

(మొదటిపేజీ తరువాయి)

మంది ఇంతవరకు ఆయనను కలవలేని పరిస్థితి ఉందన్నారు. కూతవేటు దూరంలో ఉన్న సచివాలయానికి వెళ్లాలన్నా, చివరకు పక్క వీధిలోకి వెళ్లాలన్నా వేలాదిమంది పోలీసు బలగాలు, హెలికాప్టర్ ఉండాల్సిందేనని చెప్పారు. ఇటువంటి ముఖ్యమంత్రిని ఇంట్లోనే శాశ్వతంగా కూర్చోబెట్టాలని, అందుకోసం ప్రజలంతా ఎన్నికలు ఎప్పుడొస్తాయా అని ఎదురు చూస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు గుణపాఠం తప్పదని రామకృష్ణ హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతను గమనించి జగన్ విజ్ఞతతో వ్యవహరించి అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఐ తొలి నుంచి విజయవాడలో రాజధాని పెట్టాలని పోరాడుతున్న తీరును వివరిస్తూ అమరావతి రైతుల ఉద్యమానికి ఎల్లవేళలా అండగా ఉండడమే గాక తాము ముందుంటామని రామకృష్ణ ఉద్యమకారులకు భరోసా ఇచ్చారు.

ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా అమరావతి రాజధానికి మద్దతు పలికి... వైసీపీ అధికారంలోకి వస్తే టీడీపీ ప్రభుత్వం చెప్పినదానికంటే పెద్ద రాజధానిని నిర్మిస్తామన్న జగన్...రైతులను నమ్మించి గొంతు కోశారని మండిపడ్డారు. రాజధాని నిర్మాణం కోసం చిల్లిగవ్వ తీసుకోకుండా అత్యంత సారవంతమైన, కన్నతల్లి కంటే ప్రేమగా చూసుకునే భూములను ఉచితంగా ఇచ్చిన రైతులను నాలుగేళ్లుగా ప్రభుత్వం ముప్పుతిప్పలు పెట్టి వేధిస్తోందన్నారు. భూములిచ్చిన వారిలో రెండు ఎకరాల లోపు రైతులు దాదాపు 21 వేల మంది ఉన్నారని, వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అన్ని కులాల రైతులు ఉన్నారన్నారు. వీరంతా భూములపై ఆధారపడి జీవించేవారని, ఇప్పుడు వారంతా ఉన్న భూమి కోల్పోయి...ప్రభుత్వం సక్రమంగా కౌలు ఇవ్వకుండా, పిల్లల చదువులు, పెళ్లిళ్లకు వారికిచ్చిన ప్లాట్లను అమ్ముకోలేని పరిస్థితిలో తీవ్ర ఆర్థిక ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. ఇంతకంటే పేద రైతులు ఎవరైనా ఉంటారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, అక్రమ కేసులతో వేధిస్తున్నా నాలుగేళ్లుగా పార్టీలకతీతంగా రైతులు సాగిస్తున్న అవిశ్రాంత ఉద్యమం చరిత్రాత్మకమని కొనియాడారు.

అమరావతి జేఏసీ నేతలు పువ్వాడ సుధాకర్, కొలికపూడి శ్రీనివాసరావు, కొందరు రైతులు మాట్లాడుతూ తమ పోరాటానికి మొదటి నుంచి సీపీఐ అండగా నిలబడుతోందని హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సీపీఐ కేంద్ర కార్యవర్గసభ్యులు అక్కినేని వనజ, రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు జి.ఈశ్వరయ్య, జంగాల అజయ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు దోనేపూడి శంకర్, పెన్మెత్స దుర్గాభవాని, టి.మనోహర్ నాయుడు, లెనిన్‌బాబు, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ నాయకులు పరుచూరి రాజేంద్ర, సుబ్బారావు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఆర్.పిచ్చయ్య, నజీర్ బృందం విప్లవగేయాలు ఆలపించింది.

బీజేపీ మతప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

ఈ పురోగతి చోదకశక్తిగా పనిచేస్తుందన్నారు. నేడు ప్రతి పిల్లవాడికి చంద్రయాన్ గురించి తెలుసునని, ప్రపంచమంతటా చంద్రయాన్ పేరు మారుమ్రోగుతోందని మోదీ అన్నారు. భారత పురాణాల్లోని అంతరిక్ష ఫార్ములాలను శాస్త్రీయపరంగా రుజువు చేసేందుకు నవతరం ముందుకు రావాలని మోదీ సూచించారు. మన వారసత్వానికి, సైన్స్‌కు ఇలా చేయడం ముఖ్యం, ఒకరకంగా ఇది స్కూళ్లు, కాలేజీలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులపై రెట్టింపు బాధ్యత అని ఆయన అన్నారు. మరుగున పడిన భారతీయ శాస్త్రీయ పరిజ్ఞానాన్ని మరిన్ని పరిశోధనల ద్వారా ప్రపంచానికి చాటాలని మోదీ పిలుపునిచ్చారు. గ్రీస్ రాజధాని ఏథేన్స్ నుంచి నేరుగా బెంగళూరుకు శనివారం ఉదయం చేరుకున్న ప్రధాని... ఇస్రో శాస్త్రవేత్తలను కలిసి లూనార్ మిషన్ విజయానికిగాను అభినందించారు. చంద్రుడిపై ల్యాండర్ విక్రమ్ దిగిన స్థలానికి శివశక్తి పాయింట్‌గా పేరు పెట్టాలని ప్రతిపాదన చేశారు. భారత అంతరిక్ష కార్యక్రమంలో చంద్రయాన్-3 అసాధారణ ఘట్టమని చెబుతూ కాస్త భావోద్వేగానికీ గురయ్యారు. ఎప్పుడెప్పుడు వెళ్లాలా... అందరినీ అభినందించాలా అని ఆత్రుతగా ఎదురుచూశానని చెప్పారు. ఇస్రో శాస్త్రవేత్తల నిబద్ధతకు, ధైర్యానికి, పట్టుదలకు, ఫ్యాషన్‌కు సెల్యూట్ చేస్తున్నానన్నారు. భారత్ గర్వంగా చంద్రుడిపైకి చేరుకుందని బరువైన గొంతుకతో మాట్లాడారు. చంద్రయాన్-3 మిషన్‌లో మహిళా శాస్త్రవేత్తల తోడ్పాటును శ్లాఘించారు. మిషన్‌లో నారీశక్తిది ప్రధానపాత్ర అని మోదీ అన్నారు. అంతకుముందు హాల్ విమానాశ్రయం వద్ద మోదీకి ఘనస్వాగతం లభించింది. అక్కడ నుంచి ఆయన రోడ్‌షోగా ఐఎస్‌టీఆర్ఏసిక చేరుకున్నారు. రోడ్డుకు రెండు వైపులా జనం నిలుచొని జాతీయ జెండాలు ఊపుతూ మోదీకి స్వాగతం పలికారు. ఐఎస్‌టీఆర్ఏసీలో ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ఆయనకు చంద్రయాన్-3 మిషన్ పురోగతి గురించి వివరించారు.

యువ సాహిత్య పురస్కారాలకు ఆహ్వానం

విశాలాంధ్ర-విజయవాడ: యువ సాహిత్య ప్రతిభా పురస్కారం కోసం యువకవుల/కవయిత్రులు నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కుసుమ ధర్మన్న కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు, కుసుమ ధర్మన్న మనవరాలు డాక్టర్ రాధా కుసుమ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుదారుల వయసు 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలి. ఇంతకు ముందు ప్రముఖ పత్రికల్లో కనీసం నాలుగు కవితలు ప్రచురించబడి ఉండాలి. నాలుగు పోటీల్లో విజేతలుగా నిలిచి ఉండాలి. దరఖాస్తులో తమ వివరాలను క్లుప్తంగా వివరించాలి. ఎన్నికైన యువకవి/కవయిత్రికి రూ.5,116 నగదు బహుమతి, ప్రసంసా పత్రం, శాలువ, వస్త్ర కిరీటం, కంకణం, జ్ఞాపికతో సెప్టెంబరులో హైదరాబాద్‌లో ప్రతిష్టానంగా జరగబోయే సభలో ఘనంగా సత్కరిస్తారు. దరఖాస్తులను ఐబీఆర్ఎఫ్ సభ్యులు, డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్ చరవాణి సంఖ్య 9490841284కు వాట్సాప్‌కు ఆగష్టు 31లోపు పంపాలని డాక్టర్ రాధా కుసుమ తెలిపారు.

డయేరియాకు యువకుడి మృతి

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: అల్లూరి జిల్లా దుంబ్రిగూడ మండలం మొర్రిగుడలో డయేరియా ప్రబలింది. దయారియా సోకి గ్రామానికి చెందిన గిరిజనుడు వంతల త్రినాథ్ (34) విశాఖలోని కింగ్‌జార్జి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన పాంగి కొత్తు(50) అనే గిరిజనుడు డయేరియాతో బాధలు పడుతూ అరకులోయలోని వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నాడు. తాగునీటి సౌకర్యం అంతంత మాత్రంగా ఉండటంతో ఊట బావుల్లో ప్రవహించే కలుషిత నీటిని వినియోగించడం వల్లే వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నట్లు గిరిజనులు చెబుతున్నారు. డయేరియాతో సతమతమవుతున్న మొర్రిగుడలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ పి.సురేశ్ కుమార్ అధికార యంత్రాంగాన్ని కోరారు. మొర్రిగుడలో గత ఏడాది ఇదే మాసంలో డయేరియాకు ఆరుగురు మృత్యువాత పడగా వందమందికి పైగా వాంతులు, విరేచనాలతో బాధపడ్డారని ఆయన గుర్తు చేశారు. డయేరియా వ్యాప్తికి గల కారణాలపై ప్రత్యేక వైద్య నిపుణులను పంపాలని విన్నవించారు. డయేరియా అదుపుపై జిల్లాస్థాయి ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన కోరారు. గ్రామంలో 220 కుటుంబాలు, 12 వందల జనాభా ఉన్నట్లు ఆయన తెలిపారు.

28 నుంచి వ్యాయామ ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ప్రతాప్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాఠశాల విద్యా శాఖ ఆదేశాల మేరకు ఈనెల 28 నుంచి వ్యాయామ ఉపాధ్యాయులకు సైతం మొదటిసారిగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జీ. ప్రతాపరెడ్డి వెల్లడించారు. ఈ సమావేశాలకు ఆయా నియోజకవర్గాల పరిధిలోని అన్ని యాజమాన్య పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో వ్యాయామ విద్య, క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. తాజాగా అమల్లోకి వచ్చిన విధి విధానాలపై విరివిగా వ్యాయామ ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించి సూచనలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇప్పటి వరకు ఉపాధ్యాయులకే పరిమితమైన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఇకపై వ్యాయామ ఉపాధ్యాయులకూ నిర్వహించాలని నిర్ణయిస్తారని తెలిపారు. తాజాగా పాఠశాల విద్యా కమిషనర్ నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారని గుర్తుచేశారు. వాస్తవానికి ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు మండలాల వారీగా నిర్వహిస్తున్నారని వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయులకు మాత్రం నియోజకవర్గాల స్థాయిలో ఆయా స్కూల్ కాంప్లెక్స్‌లలో సమావేశాలు నిర్వహిస్తారని ఆయన స్పష్టం చేశారు.

కార్పొరేట్ల కబంధహస్తాల నుంచి

విద్యారంగాన్ని కాపాడుకోవాలి

ఏఐఎస్ఎఫ్ కర్నూలు జిల్లా మహాసభలో వక్తల పిలుపు

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: ప్రైవేట్, కార్పొరేట్‌ల కబంధహస్తాల నుంచి విద్యారంగాన్ని కాపాడుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని విద్యార్థులకు వక్తలు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ తిరోగమనంలో ఉందని, అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన నిధులను సక్రమంగా మంజూరు చేయకుండా రకరకాల కొర్రీలు పెట్టి రాష్ట్ర ప్రభుత్వం వేధిస్తోందన్నారు. జీఓ 77ను రద్దు చేయాలని, దీనివల్ల పీజీ విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల్లో చదివితే ఫీజులను ప్రభుత్వం ఇవ్వదని, యూనివర్సిటీ విద్యార్థులకు మాత్రమే చెల్లిస్తుందని, దీంతో విద్యార్థులకు నష్టమన్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్నం భోజనం అందజేయకుండా జూనియర్ కళాశాల విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారన్నారు. చివరకు వైద్యవిద్యను పూర్తిగా ప్రైవేట్‌పరం చేసి రిజర్వేషన్లకు రాష్ట్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదన్నారు. కర్నూలు జిల్లా నిర్మాణ మహాసభ స్థానిక ఎస్టీయూ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న అధ్యక్షతన జరిగింది. తొలుత ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని మాజీ నాయకులు బి.గిడ్డయ్య ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ విద్యారంగంలో సంస్కరణల పేరుతో ఎన్ఈపీని తెచ్చి విద్య కాషాయీకరణకు కుట్ర జరుగుతోందని విమర్శించారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని తగ్గించి అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదన్నారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు ఎత్తివేయాలని మోదీ ప్రభుత్వ కుట్రకు వ్యతిరేకంగా, భవిష్యత్‌ను కాపాడుకునేందుకు విద్యార్థి, యువజనులు దేశవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహాసభలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు గౌడ్, ఆఫీస్ బేరర్లు విజేంద్ర, షబ్బీర్ బాషా, థామస్, శరత్ కుమార్, రంగస్వామి, అల్తాఫ్, జిల్లా కార్యవర్గ-సమితి సభ్యులు పాల్గొన్నారు.

భారాలపై 30 నుంచి సీపీఎం సమరభేరి

శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ భారాలతో దోచుకుతింటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 30వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమరభేరి పేరుతో ఆందోళన చేపట్టనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం విజయవాడ బాలోత్సవ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.సీతారాం, వి.వెంకటేశ్వర్లు, కె.సుబ్బరావమ్మతో కలిసి సమరభేరి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ భారాలకు వ్యతిరేకంగా ఈ నెల 30 నుంచి సెప్టెంబరు నాలుగోతేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. 30, 31 తేదీలలో ప్రచారం, సంతకాల సేకరణ, ఒకటో తేదీన సచివాలయాల్లో అర్జీలు సమర్పిస్తామని, నాలుగోతేదీన అన్ని మండల కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడతామని వివరించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే 5వ తేదీన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. కేంద్రం విధిస్తున్న షరతులకు తలొగ్గి రాష్ట్రం ఇష్టం వచ్చినట్లు భారాలు మోపుతోందని తెలిపారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయని, విద్యుత్ భారాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. ప్రపంచ బ్యాంకు షరతులను కేంద్రం అమలు చేస్తూ రాష్ట్రాలపైనా రుద్దుతోందని, రాష్ట్రం కూడా అప్పుల కోసం కేంద్రం విధించిన షరతులన్నీ అమలు చేస్తోందని విమర్శించారు. దీనివల్ల సామాన్య ప్రజలపై మోయలేని భారాలు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

భారత్‌మాల పేరుతో జాతీయ రహదారులు నిర్మాణానికి ప్రభుత్వాలు లక్షల ఎకరాలు సేకరించి వాటిని అదాని కంపెనీలకు కట్టబెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నారని శ్రీనివాసరావు విమర్శించారు. కానీ భూములిచ్చిన రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. భారత్‌మాల పేరుతో జాతీయ సంపదను దోచిపెడుతున్నారని కాగ్ కూడా వేలెత్తి చూపిందన్నారు. రూ.10 లక్షల కోట్లతో రెండు దశల్లో చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రైతులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. అభివృద్ధి అనే పేరుతో అడ్డగోలుగా కార్పొరేట్ సంస్థలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు కట్టబెడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ప్రజానీకమంతా వ్యతిరేకించాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

విశాఖలో రెండు ఆస్పత్రులకు ఎన్ఏబీహెచ్ గుర్తింపు

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలోనే తొలిసారిగా విశాఖలోని రెండు ఆసుపత్రులకు నేషనల్ అక్రిడియేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్ (ఎన్ఏబీహెచ్) అక్రిడేషన్ మంజూరు చేసింది. గవర్నమెంట్ మెంటల్ కేర్ హాస్పిటల్ (జీఎంసీహెచ్), గవర్నమెంట్ హాస్పిటల్ ఫర్ ఛెస్ట్ డిసీజెస్ ఆసుపత్రులకు ఈ అక్రిడేషన్ లభించింది. ఎన్ఏబీహెచ్ అనేది క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ)లోని ఒక విభాగం. ఇది దేశంలోని ఆసుపత్రులు, హెల్త్ కేర్ సెంటర్స్, రక్తదాన కేంద్రాలు, ఆయుష్ ఆసుపత్రులు, వివిధ స్థాయిల్లో పనిచేసే హెల్త్ కేర్ యూనిట్లకు నాణ్యతా ప్రమాణాలను బట్టి గుర్తింపు ఇచ్చేందుకు ఏర్పాటు చేశారు. సుమారు 10 చాప్టర్లు, 100 ప్రమాణాలు కలిగిన ఈ విభాగం 503 లక్ష్యాలతో పనిచేస్తుంది. ఆస్పత్రులు తమ అక్రిడేషన్ కోసం బోర్డుకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. కేంద్రం ఇచ్చిన ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే అంశాన్ని పూర్తి స్థాయిలో పరిశీలించి, ఆస్పత్రులు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ)కి అనుగుణంగా ఉన్నట్టు నిర్ధారించిన తర్వాత, వాటికి అక్రిడియేషన్ మంజూరు చేస్తారు. అక్రిడియేషన్ కాల పరిమితి మూడేళ్లు. ఎన్ఏబీహెచ్ ధృవీకరణ పొందాలంటే ఆస్పత్రులు ఎనిమిది విభాగాల్లో నాణ్యతా ప్రమాణాలు కలిగి ఉండాలి. సర్వీస్ ప్రొవిజన్, రోగుల హక్కులు, ఇన్‌పుట్స్, సహాయక సేవలు, క్లినికల్ కేర్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్, క్వాలిటీ మేనేజ్‌మెంట్, నాణ్యమైన ఆరోగ్య సేవల నిర్వహణ, రోగి భద్రత... ఈ విభాగాల్లో సంపూర్ణమైన ప్రమాణాలు పాటిస్తున్నాయి. ఇలాంటి ప్రమాణాలు ఉండటం వల్ల విశాఖపట్నంలోని రెండు ఆస్పత్రులు అక్రిడేషన్‌ను అందుకున్నాయి.

సెప్టెంబర్ 1 నుంచి 45 రోజుల పాటు

బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ

- ఇసుక దోపిడీపై సత్యాగ్రహం
- టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ ప్రభుత్వంపై పోరుకు తెలుగుదేశం పార్టీ మరో కార్యక్రమాన్ని రూపొందించింది. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ' పేరుతో సెప్టెంబర్ 1 నుంచి 45 రోజుల పాటు బూత్ వారీగా రోజుకి 10 ఇళ్ల చొప్పున నేతలు తిరిగే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈ మేరకు టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో కార్యక్రమ షెడ్యూలు విడుదల చేస్తూ, నేతలకు మార్గనిర్దేశం చేశారు. ప్రజావేదిక అనే కార్యక్రమం ద్వారా నియోజకవర్గ ఇన్ ఛార్జ్‌లు ప్రతి మండల, పట్టణ, నగర ప్రధాన కేంద్రాల్లో పాద యాత్ర చేసి,ఇంటింటి ప్రచారం చేసి, ఒక బహిరంగ సభ నిర్వహించి ఈ కార్యక్రమం ద్వారా ఏంచేయబోతున్నామో తెలియచేస్తూ ప్రజలకు ఒక నమ్మకం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తాను 35 నియోజకవర్గాల్లో పర్యటిస్తానని చంద్రబాబు తెలిపారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్ కు గ్యారంటీ' కార్యక్రమంలో 3 కోట్ల ఓటర్లను కలవాలి. కార్యక్రమంతో 75శాతం మందినే కలుస్తాం. కానీ ఎన్నికల సమయానికి నూటికి నూరు శాతం మందిని కలవగలిగితే ప్రజా చైతన్యం పెరుగుతుంది. వారిలో భవిష్యత్‌కు భద్రత ఉంటుందనే నమ్మకం కలుగుతుంది" అని చంద్రబాబు చెప్పారు. ఈ మొత్తం కార్యక్రమంలో ఎవరికీ ఎలాంటి మినహాయింపు లేదు. ప్రత్యర్థి చేసే తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు చాలా వరకు కట్టడి చేశాం. ఈ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. మనం ఇదివరకు నిర్వ హించిన కార్యక్రమాలతో ప్రజల్లో అనూహ్యమైన మార్పు వచ్చింది. జగన్ పని అయిపోయిందనడంలో ఎవరికీ ఎలాంటి సందేహం అక్కర్లేదు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎప్పుడూ మనం పోటీచేయలేదు. కానీ మొట్టమొదటిసారి మూడు ప్రాంతాల్లో మూడు ఎమ్మెల్సీలు గెలిచాం. పులివెందుల వ్యక్తిని ఎమ్మెల్సీని చేశాం. మన ఎమ్మెల్యేలను లాక్కున్నారు. ప్రజలు మనల్ని గెలిపించిన 23స్థానాలు మనకు లేవు. అయినా ఎమ్మెల్యేకోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మనపార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిని 23 ఓట్లతో గెలిపించాం. దేవుడి స్క్రిప్ట్ తిరగరాశాడు. ఆ తిరగరాయడమే వైసీపీ పతనమన్నారు. తెనాలి బుర్రిపాలెంలో ఎస్సీల ఓట్లు మొత్తం టీడీపీ అభ్యర్థికే పడ్డాయి. కొండేపి నియోజకవర్గం పాకాలలో 30 ఏళ్ల నుంచి మనం గెలిచింది లేదు. 7500 ఓట్లున్న పంచాయతీలో 250 ఓట్లతో గెలిచాం. గెలుపుకోసం ఓటుకి రూ.5వేలు పంచారు. మీరిచ్చే 5 వేలు కాదు..రాష్ట్రమే ముఖ్యమని ప్రజలు గట్టిగా చెప్పారు. పొద్దుటూరులో కూడా 5వేలు పంచారు. కానీ గెలవలేదు. జగన్ పని అయిపోయింది...అతను కోలుకునే పరిస్థితి లేదు. ప్రజా చైతన్యం తీసుకురావడంతో పాటు, ప్రజలకు ఒక నమ్మకం కల్పిస్తే మనం అనుకున్నది సాధించగల్గుతామన్నారు. భవిష్యత్‌లో జగన్ కంటే మూడురెట్లు అధికంగా సంక్షేమాన్ని అందించే పార్టీ తెలుగుదేశం పార్టీ. సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా జరగాలి. సంపద సృష్టితో ఆదాయం పెరిగితే, సంక్షేమం..అభివృద్ధి సమాంతరంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. మూడు రాజధానులని మూడు ముక్కలాట ఆడి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశాడు. వీళ్ల స్వలాభంకోసం వేంకటేశ్వరస్వామిని కూడా అప్రదిష్ట పాలు చేస్తున్నారు. మద్యం కుంభకోణంలో నేరాన్ని ఒప్పుకున్న వ్యక్తిని టీటీడీ సభ్యుడిగా నియమించారు. నాలుగు న్నరేళ్లలో జరిగిన దోపిడీ, అన్యాయం, విధ్వంసంతో పాటు, మనం వస్తే ప్రజలకు ఏం చేస్తామో కూడా చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఇవన్నీ ప్రజలకు వివరించి చైతన్యం తీసుకురావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు, శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

'హిస్టరీ ఆఫ్ ఇండియన్ జర్నలిజం' పుస్తకావిష్కరణ

పాట్నా: విశ్రాంత ఉపాధ్యాయుడు మాడభూషి కృష్ణ ప్రసాద్ రచన 'హిస్టరీ ఆఫ్ ఇండియన్ జర్నలిజం' పుస్తకాన్ని బీహార్ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సురేంద్ర రామ్ ఆవిష్కరించారు. బీహార్ విధానమండలి ఉపభవనం సమావేశమందిరంలో శనివారం మొదలయిన ఐజేయూ జాతీయ కార్యవర్గ సమావేశాల ప్రారంభ సభలో పుస్తకావిష్కరణ జరిగింది. బీహార్ కార్మికశాఖ మంత్రితో పాటు బీహార్ శాసనసభలో కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత షకీల్ అహ్మద్ ఖాన్, సీపీఐ శాసనసభా పక్ష నాయకుడు సూర్యకాంత్ పాశ్వాన్, సీపీఐ ఎంఎల్ శాసనసభ్యులు సందీప్ సౌరభ్, ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి, సెక్రెటరీ జనరల్ బల్విందర్ సింగ్ జమ్ము, పూర్వాధ్యక్షుడు ఎస్ఎన్ సిన్హా, జాతీయకార్యదర్శి డి.సోమసుందర్, బీహార్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నివేదితా ఝా, ప్రధాన కార్యదర్శి కమల్‌కాంత్ సహాయ్, రచయిత మాడభూషి కృష్ణ ప్రసాద్, వంగపండు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మాడభూషి కృష్ణప్రసాద్ ఎంతో పరిశోధన చేసి మంచి ప్రమాణాలు గల భారతీయ పత్రికారంగ చరిత్ర పుస్తకాన్ని తెలుగులో రాశారని, ఆయనే దాన్ని ఇంగ్లీష్ అనువాదం చేశారని, తాజాగా ప్రచురితమైన ఇంగ్లీషు పుస్తకాన్ని ఐజేయు కార్యవర్గ సమావేశాల వేదికపై ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. మాడభూషి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ జర్నలిస్ట్ కావాలన్న తన చిన్నప్పటి కల నెరవేరలేదనీ, 40 ఏళ్ల పాటు బడిపిల్లలకు ఇంగ్లీషు గ్రామర్ బోధించి పదవీ విరమణ చేసిన తర్వాత పరిశోధన చేయడానికి తనకు సమయం చిక్కిందని అన్నారు. తనకు జర్నలిజంపై ఉన్న ప్రేమతోనే హిస్టరీ ఆఫ్ ఇండియన్ జర్నలిజం పుస్తకాన్ని రచించానని తెలిపారు. కార్టూనిస్ట్ శంకర్‌పై రాసిన పుస్తకం ఇటీవలే ప్రచురితమైందన్నారు. త్వరలో జర్నలిజంపై మరికొన్ని పుస్తకాలు రాస్తానని తెలిపారు. తన పుస్తకాన్ని ఆవిష్కరణ చేసిన ఐజేయూ జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రచయితను మంత్రి సురేంద్ర రామ్ శాలువాతో సత్కరించారు. మాడభూషి కృష్ణప్రసాద్ ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణానికి చెందినవారు. పుస్తకావిష్కరణను పాట్నా జాతీయ కార్యవర్గ సమావేశంలో నిర్వహించడంపై ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు హర్షం వ్యక్తం చేశారు.

ఆ హాస్టల్లో ఏం జరుగుతోంది?

- తరచూ బాలికల పరారీ
- తనిఖీకి అనుమతించని నిర్వాహకులు
- పోలీసుల జోక్యానికి స్థానికుల డిమాండ్

విశాలాంధ్ర- కృత్తివెన్ను: తీర ప్రాంతానికి ఆనుకుని నిర్మించి, నిర్వహిస్తున్న న్యూ హరిజోన్స్ సేఫ్ హోమ్ బాలికల వసతి గృహం నుంచి తరచూ బాలికలు పరారీ అవుతుండడంపై ఆ ప్రాంతంలోని గ్రామాలలో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతుంది. రెండేళ్లుగా నిడమర్రు తీర ప్రాంత గ్రామపంచాయతీ అడవిదొడ్ల గ్రామం శివారు తోటలలో న్యూ హరిజోన్ సేఫ్ హోంను నిర్వహిస్తున్నారు. అత్యంత కట్టుదిట్టంగా భవన నిర్మాణం చేసి ఇక్కడ హాస్టలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ హాస్టల్లో బాలికలు మాత్రమే ఉంటారు. బాలికలలో కొందరిని వాహనంలో ప్రతిరోజు పశ్చిమగోదావరి జిల్లాకు తీసుకువెళ్లి తీసుకువస్తుంటారు. ఎందుకు ప్రతిరోజు బాలికలను వాహనంలో వేరే ప్రాంతానికి తీసుకు వెళుతున్నారని స్థానికులు ప్రశ్నిస్తే... కాలేజీకి అని నిర్వాహకులు చెబుతారు. అయితే గత నాలుగు నెలల క్రితం హాస్టల్ నుంచి నలుగురు బాలికలు అర్ధరాత్రి సమయంలో పరారీ కావడంతో ఈ హాస్టల్ ఒక్కసారిగా వార్తల్లోకి ఎక్కింది. నిర్వాహకులు హాస్టల్ నుంచి విద్యార్థినుల పరారీపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి పరారైన వారిని శోధించి పట్టుకుని హాస్టల్ నిర్వాహకులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న స్థానిక తహసిల్దార్, ఎంపీడీవో హాస్టల్‌కి వెళ్తే వారిని లోనికి అనుమతించలేదు. తర్వాత వార్తాపత్రికల ద్వారా విషయం తెలుసుకున్న బంటుమిల్లి న్యాయస్థానం మెజిస్ట్రేట్ వ్యక్తిగతంగా హాస్టలను పరిశీలించారు. అనంతరం మండలంలో నిర్వహిస్తున్న మొత్తం హాస్టల్స్ వివరాలను సేకరించి నిర్వహకులకు హాస్టల్‌వాసుల భద్రతపై అనేక సూచనలు చేశారు. ఇది ఇలా ఉంటే... గురువారం ఉదయం మరోసారి ఒక బాలిక పరారీ కావడంతో న్యూ హారిజోన్స్ హాస్టల్ మరొకసారి వార్తల్లోకి ఎక్కింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై ఏ. గణేష్ కుమార్ నేతృత్వంలో ఆరు బృందాలుగా ఏర్పడి గాలింపులు చేయగా... శుక్రవారం ఉదయం కంకిపాడు బస్టాండ్‌లో బాలికను పోలీసులు గుర్తించారు. ఆమెను కృత్తివెన్ను పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి... అనంతరం హాస్టల్ సిబ్బందికి అప్పగించారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు భీమవరానికి చెందిన మేడిత విజయ అనే వ్యక్తి ఈ వసతి గృహాన్ని నిర్వహిస్తున్నట్లు, స్థానికంగా విక్టర్‌బాబు అనే వ్యక్తి నిర్వాహణ బాధ్యతలు చూస్తుంటాడని సమాచారం. అయితే వీరి పేర్లు కూడా స్థానికంగా ఎవరికీ తెలియదు. ఎందుకు ఇంత రహస్యంగా ఉంచుతున్నారో ఎవరికీ అంతుపట్టదు. ఈ హాస్టల్ నుంచి తరచూ అమ్మాయిలు పరారీ కావడంతో అసలు హాస్టల్లో ఏమి జరుగుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. తరచూ అమ్మాయిలు పరారీ కావడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అధికారులను సైతం హాస్టల్లోనికి అనుమతించకపోవడంపై ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆవరణ బయట ఉన్న హాస్టల్ పేరు తప్ప హాస్టల్ నిర్వహణ గురించి ఎవరికీ తెలియక పోవడం గమనార్హం. ఈ హాస్టల్‌కు అసలు అనుమతులు ఉన్నాయా... హాస్టల్ నిర్వాహణకు నిధులు ఎక్కడి నుంచి సమకూరుతున్నాయి... హాస్టల్ నుంచి ప్రతిరోజు కొంతమంది ఆడపిల్లలు మాత్రమే వాహనాల్లో బయటకు ఎందుకు తీసుకెళ్తున్నారు... ఇంతకీ అసలు హాస్టల్‌లో ఏం జరుగుతుంది... ఈ ప్రశ్నలకు సమాధానాలపై స్థానికుల్లో అనుమానాలు రేగుతున్నాయి. పోలీసులు, రెవెన్యూ అధికారులు తక్షణం స్పందించి హాస్టల్లో అసలు ఏం జరుగుతుందో తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మికుల ఐక్యతతోనే హక్కుల సాధన

జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-మల్కాపురం: కార్మికుల ఐక్యతతోనే హక్కులు సాధన సాధ్యమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, కోరమండల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి చెప్పారు. విశాఖ జిల్లా మల్కాపురంలో సీపీఐ మండలస్థాయి సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మోదీ సర్కారు కార్మికుల హక్కులు హరిస్తోందని, యాజమాన్యాలకు తొత్తుగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. అందుకే కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతోందన్నారు. దీన్ని కార్మికులంతా ముక్తకంఠంతో వ్యతిరేకించాలని, ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గతంలో ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు అనంతరం పరిశ్రమలో నెలకొన్న పరిస్థితుల గురించి కార్మికులను అడిగి తెలుసుకున్నారు. విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి (ఏఐటీయూసీ), సీపీఐ నాయకులు గుడాల రాంబాబు, నూనెల సూరిబాబు, కోరమండల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు సత్తిబాబు, ప్రకాశ్, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

భారీగా గంజాయి పట్టివేత

ఒడిశా నుంచి తరలిస్తుండగా స్వాధీనం



విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరులో 901 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. దీని విలువ కోటి రూపాయలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో నలుగురిని అదుపులోకి తీసుకోగా... ముగ్గురు పరారయ్యారు. వీరిపై కేసులు నమోదు చేసినట్టు చింతపల్లి సబ్ డివిజన్ ఏఎస్పీకే ప్రతాప్ శివకిషోర్ ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లాలోని జీకే వీధి సర్కిల్ ఇన్స్పెక్టర్ జీ.అశోక్ కుమార్, సీలేరు సీలేరు ఎస్సై జే.రామక్రిష్ణ పాత గంజాయి ముద్దాయిలు, వారి అనుచరులపైన నిఘా పెట్టి, విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. అందులో భాగంగా శుక్రవారం పక్కా సమాచారంతో మాయాబజార్ జంక్షన్, ధారకొండ గ్రామం వద్ద వాహన తనిఖీలు చేయగా ఒరిస్సా నుంచి పేట్రాయి గ్రామం మీదగా వస్తున్న అశోక్ లేలాండ్ వాహనం తనిఖీలో 35 బస్తాలలో ఉన్న 901 కేజీల గంజాయి కనుగొన్నారు. గంజాయిని రవాణా చేస్తున్న ధారకొండ పంచాయతీ, దబ్బకోట గ్రామానికి చెందిన కర్రీ అప్పన్న, ములశాలవీధి గ్రామానికి చెందిన శెట్టి రాంబాబు, శెట్టి చిన్నబ్బాయి, చిలక మామిడి గ్రామానికి చెందిన కొర్రా నారాయణను పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. గంజాయిని ఒరిస్సా రాష్ట్రం, చిత్రకొండ బ్లాక్, టేక్ పొధర్ గ్రామంలో కొనుగోలు చేసి, విజయవాడకు తరలిస్తున్నారని పోలీసులు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ కోసం ఆమరణ దీక్ష

రేపటి నుంచి ప్రారంభం: కేఏ పాల్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం దీక్షలు చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ప్రకటించారు. ఆశీలమెట్టలో గల కేఏ పాల్ ఫంక్షన్ హాలులో శనివారం జరిగిన మీడియా సమావేశంలో కేఏ పాల్ మాట్లాడారు. ప్రధాని మోదీ, బీజేపీ నేతల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో తనపై పెద్దకుట్ర జరుగుతోందని విమర్శించారు. మూడు రోజుల క్రితం మోదీ మిత్రుడు అదానీకి వెయ్యి కోట్ల విలువైన భూమి కేటాయించారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, జగన్, మోదీనీ ఢీకొని తెలుగు ప్రజల సంక్షేమం కోసం విశాఖ ఉక్కు కోసం దీక్షలకు దిగుతున్నట్లు చెప్పారు. ఈ నెల 28 మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆశీలమెట్టలోని కేఏ పాల్ ఫంక్షన్ హాల్ అవరణలో ఆమరణ దీక్ష ప్రారంభిస్తానని తెలిపారు. తన దీక్షకు 15 కోట్ల తెలుగు ప్రజలు సంఘీభావం ప్రకటించాలని కోరారు. కేంద్రం ఇస్తామన్న ప్రత్యేక హోదా, వెనుక బడిన జిల్లాలకు ప్యాకేజీ, పోలవరం, స్మార్ట్ సిటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రం అప్పుల భారం తీర్చే సత్తా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి మాత్రమే ఉందని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను సక్రమంగా నిర్వహిస్తే ఏటా లక్ష కోట్ల రూపాయల ఆదాయం వస్తుందన్నారు. ప్లాంట్‌కు 33 వేల ఎకరాలు భూములు ఉన్నాయని, తనను ఎంపీగా గెలిపిస్తే గంగవరం పోర్టును సీజ్ చేస్తానన్నారు. తెలుగు ప్రజల సత్తా చూపిస్తామని, గుజరాత్‌కి గుణపాఠం నేర్పుతామన్నారు. తనను చంపుతామని బెదిరిస్తున్నారని, మోదీని ఓడించే సత్తా ఉన్నందునే తనను చంపాలని చూస్తున్నారని ఆరోపించారు. మోదీని గెలిపించాలని పవన్ కల్యాణ్ పిలుపు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. ప్రజాప్రతినిధులంతా టీడీపీ, వైసీపీ, బీజేపీ నుంచి బయటకు రావాలని పిలుపునిచ్చారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలలోగా ప్రధాని, బీజేపీ నేతలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై స్పష్టమైన ప్రకటన చేయకుంటే దీక్షకు దిగడం తథ్యమని పేర్కొన్నారు. దీక్షా శిబిరం ఏర్పాటులో భాగంగా ఆదివారం సాయంత్రం కోరమాండల్ మైదానంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీని గెలిపించాలని కోరారు.

సవరణ

విశాలాంధ్ర ఆగస్టు 24వ తేదీ గురువారం సంచిక 7వ పేజీ (బాపట్ల జిల్లా పేజి)లో "నాసా శాస్త్రవేత్తలకు అభినందనల వెల్లువ" శీర్షికతో వచ్చిన వార్తలో ఇస్రో అని ఉండడానికి బదులుగా నాసా అని పొరపాటుగా ప్రచురితమైంది. చెరుకుపల్లి విలేకరి పంపిన వార్తను సరిచేయకపోవడం వల్ల ఈ పొరపాటు దొర్లింది. అసంకల్పితంగా జరిగిన ఈ తప్పుకు చింతిస్తున్నాం.

॥సం॥

సంపాదకీయం

ఉత్తేజం నింపిన బస్సుయాత్ర

కేంద్రంలో బీజేపీ నాయకత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలన వచ్చిన నాటినుంచి అనేక ప్రజా వ్యతిరేక నిర్ణయాలు, విధానాలు అమలుచేస్తూ, ఆర్థికవ్యవస్థను దిగజార్చారు. నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, సామాన్యులకు కడగండ్లు అధికమయ్యాయి. ఉదాహరణకు 2014లో వంటగ్యాస్ సిలిండరు రూ.404 ఉండగా, నేడు రూ.1100పైగా ఉంది. ఈ విధంగా ప్రజల జీవనవ్యయం రెట్టింపు అయింది. మోదీ పాలనలో గత ఐదేళ్ల కాలంలో వైద్యం కోసం చేసే ఖర్చు చిన్న చిన్న పట్టణాలు, పల్లెల్లో రెట్టింపు కాగా, నగరాల్లో మరింతగా పెరిగింది. నిత్యావసర వస్తువుల ధరలు మోదీ పాలనలో ఏనాడు అదుపులో లేవు. గత మూడేళ్ల కాలంలో ధరల పెరుగుదలసెగ మరింతగా మనకు అనుభవంలోకి వచ్చింది. జులైలో టమోటా, మిర్చి, ఉల్లిపాయల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయాయి. ఓట్లు ప్రజలవి, ఫలితాలు నల్లకుబేరులకు చేరుతున్నాయి. అందువల్లనే మోదీ వచ్చాక కుబేరుల సంఖ్య 162కు చేరింది. ప్రతిపక్ష నేతలపై అవినీతి కేసులు మోపుతూ, బీజేపీ నేతలు నీతిపరులైనట్లుగా ప్రచారం ఉధృతంగా సాగుతోంది. మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్రజాద్రోహానికి పాల్పడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలను, బ్యాంకులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారు. మహత్తర ఉద్యమంచేసి ప్రాణత్యాగాలుచేసి సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు కార్పొరేట్లకు విక్రయించాలని నిర్ణయించారు. రైతులను, కార్మికుల వ్యతిరేక చట్టాలుచేసే వీరి జీవితాలను దుర్భరం చేయడానికి పూనుకున్నారు. అన్ని రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట పెట్టుకుని మోదీ నియంతవలె పాలిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేస్తున్నారు. చివరకు న్యాయవ్యవస్థను సైతం లొంగదీసుకునేందుకు యత్నిస్తున్నారు. స్వాతంత్ర్య పోరాటం ఎరుగని మిత, మతవాద శక్తులైన పాలకులు స్వాతంత్ర్యానికి, రాజ్యాంగానికి ముప్పుకలిగించే చర్యలు చేపట్టారు. మోదీ పాలన ఇంకా కొనసాగితే రానున్న కాలంలో మధ్యయుగాలనాటి సామాజిక వ్యవస్థను నెలకొల్పి రాజులపాలన తీసుకువచ్చే సూచనలు బలంగా ఉన్నాయి. ఈ సమస్యలతోపాటు, రాష్ట్ర ప్రభుత్వ పాలనలో అవకతవకలు, అక్రమాలను ప్రజలకు వివరించి ప్రత్యామ్నాయ ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవలసిన ఆవశ్యకతను తెలియజేసేందుకు సీపీఐ రాష్ట్రవ్యాప్తంగా బస్‌యాత్రను విజయవంతంగా నిర్వహిస్తోంది. ఈ యాత్రకు ప్రజాస్పందన బాగా ఉంది. పార్టీ కార్యకర్తలు ఉత్తేజం పొందుతారు. స్ఫూర్తిదాయకంగా బస్సుయాత్ర సాగుతోంది. ఈ నెల 17న విశాఖపట్నం నుంచి బయలుదేరి అనేకచోట్ల అఖిలపక్ష సభలు జరిపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చైతన్యం కలిగిస్తున్నారు. బస్సుయాత్ర వెళ్లిన ప్రతిచోట పార్టీ, ప్రజాసంఘాల కార్యకర్తలు, ప్రజలు ఉత్సాహంతో, ఆసక్తితో స్వాగతం పలుకుతున్నారు. రోడ్డుషోలు, బహిరంగ సభలలో ప్రజలు పాల్గొని విజయవంతం చేస్తున్నారు. బస్సుయాత్ర రాష్ట్రంలోని 26జిల్లాల మీదుగా నిర్వహించిన సెప్టెంబరు 8వ తేదీకి తిరుపతికి చేరుతుంది. ఈ సందర్భంగా తిరుపతిలో భారీ బహిరంగసభను నిర్వహిస్తారు. సీపీఐ తొలినుంచి ప్రజల పక్షాన నిలిచి ప్రజల సమస్యలపై మహత్తర పోరాటాలు నిర్వహించింది. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, స్వాతంత్ర్యంవచ్చాక పాలకుల అవినీతి, అక్రమాలపై పోరాడుతూనే ఉంది. ఏనాడు ప్రజలకు ప్రయోజనం కలిగించే అంశాలపై ఉద్యమాలు నిర్వహించడంలో సీపీఐ వెనుకంజవేయలేదు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దుచేసే వరకు రైతులు చేసిన పోరాటానికి, 44 కార్మికుల చట్టాలను రద్దుచేసి నాలుగుకోడ్లను రూపొందించినందుకు కార్మికుల పోరాటాలకు సీపీఐ అండగా నిలిచింది. ఇక రాష్ట్రంలో సంక్షేమ పథకాలపై కేంద్రీకరించి అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను చేపట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. రాష్ట్రం నడిబొడ్డున గల అమరావతి రాజధానిగా అభివృద్ధి చేయకుండా వైసీపీ ప్రభుత్వం ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా నడుచుకుంటుంది. దీర్ఘకాలంగా అమరావతి ప్రాంతంలో రైతులు నిర్వహిస్తున్న దీక్షలనుసైతం పట్టించుకోకుండా ఏకపక్షంగా పనిచేస్తోంది. ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకునేందుకు సాగుతున్న ఉద్యమానికి అండగా నిలిచి కేంద్రాన్ని ఒప్పించవలసిన బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించి ప్రజలకు తీవ్ర హానిచేస్తోంది. ప్రధాన ప్రతిపక్షాలు సైతం ఉక్కు ఉద్యమాన్ని తీవ్రతరం చేయవలసిన కర్తవ్యాన్ని విస్మరించాయి. ప్రధానమంత్రి మోదీకి అండగా నిలిచి ప్రజాప్రయోజనాలను విస్మరిస్తున్న పార్టీల అక్రమాలను బస్సు యాత్రలో పాల్గొంటున్న సీపీఐ నాయకులు వివరిస్తున్నారు. రాయలసీమలో పోతిరెడ్డి పాడు గండ్రేవుల ఎత్తిపోతలు, పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టులను, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, తదితర అనేక సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయకుండా పాలకులు నిర్లక్ష్యం చేశారు. అన్నిటికంటే ముఖ్యంగా పోలవరం ప్రాజక్టు నిర్మాణం, నిర్వాసితులకు ఇళ్ల కట్టించడలో పాలకులు విఫలమయ్యారు.

ఇలా రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు సకాలంలో నిర్మించడానికి ప్రధానంగా పోలవరానికి నిధులు తీసుకురావడానికి శ్రద్ధ వహించని పాలకులు తమ సొంత ప్రయోజనాలు నెరవేర్చుకుంటున్న అంశాన్ని ప్రజలకు వివరించి చైతన్యం గావించడానికి సీపీఐ బస్సుయాత్రను నిర్వహిస్తోంది. ప్రజల సమస్యలపైన పోరాడుతున్న సీపీఐని అభినందించాలి. 1967లో 'ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు' నినాదంతో సాగిన మహత్తర ఉద్యమంలో సీపీఐ కీలకపాత్ర నిర్వహించింది. అనేకమంది ప్రాణత్యాగం చేశారు. నేడు ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకునేందుకు అన్నిరాజకీయ పక్షాలు కలిసి మళ్లీ తీవ్ర పోరాటం జరపాలి. ఈ దశలో ప్రజలను ప్రోత్సహించిన ఉద్యమంలో భాగస్వాములను చేయాలి. బస్సుయాత్రకు ముందుకూడా సీపీఐ రైతులకు గిట్టుబాటు ధరల కోసం, కార్మికుల హక్కుల కోసం, గత ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల పంపిణీ చేయాలని అనేక ఉద్యమాలు నిర్వహించింది. ప్రజల ప్రయోజనాల కోసం ఉద్యమాలు చేస్తున్న సీపీఐ తదితర వామపక్షాలను ప్రజలు ప్రోత్సహిస్తారని ఆశిద్దాం.

అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో ప్రవాస భారతీయులు

బ్రిటన్ ప్రధానిగా రిషీ సునక్, పోర్చుగల్ పీఎం కోస్టా, సింగపూర్ అధ్యక్షుడు హలీమా, మారిషస్ అధ్యక్షులు రూపన్, గయానా అధ్యక్షులు ఇర్ఫాన్ అలీ, ట్రినిడాడ్-టొబాగో అధ్యక్షులు క్రిస్టెన్ లాంటి పలువురు భారతీయ సంతతికి చెందిన ప్రముఖులు వివిధ దేశాల నాయకులుగా బహుళ ప్రచారం పొందారు. అమెరికా ఉపాధ్యక్షురాలిగా కమల హారిస్ ప్రస్తుతం పదవిలో కొనసాగడం మనకు విదితమే. ప్రవాస భారతీయులుగా ఇతర రంగాల్లో సుందర్ పిచ్చయ్, సత్య నాదెళ్ళ లాంటి టెక్ కింగ్స్ ప్రపంచ అగ్ర కంపెనీల సిఈఓలుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం భారతీయ సంతతికి చెందిన అమెరికన్ పౌరులు ఔత్సాహిక సాంకేతిక నిపుణులు 'వివేక్ రామస్వామి', ట్రంప్ ప్రభుత్వంలో ప్రముఖ పాత్రను పోషించిన మహిళ 'నిక్కీ హెలీ', ఎరోనాటికల్ ఇంజనీరు 'హర్ష్ వర్థన్‌సింగ్' అనే ముగ్గురు ప్రవాస భారతీయులు రిపబ్లికన్ పార్టీనుంచి 2024లో జరుగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో డొనాల్డ్ ట్రంప్‌తో పోటీ పడుతున్నారని వార్తలు వెలువడుతున్నాయి. భారతీయ సంతతికి చెందిన కేరళ, పాలక్కాడ్‌కు చెందిన హిందూ కుటుంబానికి చెందిన సిన్సినాటీ, ఓహియో నగరంలో ఇంజనీరు గణపతి రామస్వామి, డా.గీత రామస్వామి దంపతులకు 09 ఆగష్టు 1985న జన్మించిన 37ఏళ్ల వివేక్ గణపతి రామస్వామి హార్వర్డ్ విశ్వవిద్యాలయంనుంచి బిఏ, యేల్స్ లా కళాశాల నుంచి జె.డి. డిగ్రీ పట్టాలు పొందిన ఔత్సాహిక సాంకేతిక నిపుణుడిగా బయోటెక్ కంపెనీ స్థాపించి సిఈఓగా మంచి పేరు తెచ్చుకున్నారు. అనంతరం 'స్ట్రైవ్ అసెట్స్ అసెస్‌మెంట్' కంపెనీ ప్రారంభించి పర్యావరణ హిత సేవలు కూడా చేశారు. రానున్న అమెరికా ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరపున వివేక్ రామస్వామి అధ్యక్ష పదవికి పూర్వ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, ఫ్లోరిడా గవర్నర్ రాన్ డీసాంటిస్‌లతో గట్టిగా పోటీపడుతున్నారు. చైనా ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ, అమెరికా వైభవాన్ని నిలుపుతానని టీవీ, ఆన్‌లైన్ ప్రసంగాల్లో తన అభిప్రాయాలను ప్రజల స్పష్టంగా వివరిస్తూ మెప్పును పొందేందుకు అవిరళ కృషి చేస్తున్నారు. డా.అపూర్వ రామస్వామి (ఫిజీషియన్)ని వివాహమాడిన వివేక్ రామస్వామి వ్యక్తిత్వం, అభిప్రాయాలు అమెరికా ప్రగతికి ఉపయుక్తంగా, ఆశాజనకంగా ఉన్నాయని ప్రముఖ టెస్లా కంపెనీ అధినేత, సీఈఓ, బిలియనీర్ 'ఎలాన్ మస్క్' కూడా ప్రకటించడంతో అమెరికన్ల దృష్టి రామస్వామి అభ్యర్థిత్వం వైపు మళ్లీ అవకాశం ఉంటుంది. రిపబ్లికన్‌పార్టీ అధ్యక్ష పదవి పోటీలో డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థిత్వంలో ముందంజలో ఉన్నప్పటికీ అతనిపై కొనసాగుతున్న కోర్టు కేసులు కొంత అడ్డుపడే అవకాశం ఉండవచ్చని విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. హిందూమతాన్ని ఆచరిస్తున్న రామస్వామి భగవంతుడిపై భక్తిని కలిగి మాతృభాష తమిళంతో పాటు మలయాళం కూడా మాట్లాడగల రామస్వామి ఒక బిలియన్ డాలర్ల సంపదను కలిగి ఉన్నాడు.

భారతీయ సంతతికి చెందిన మరో రిపబ్లికన్ అభ్యర్థిగా బరిలో ఉన్న 57- ఏండ్ల మహిళ 'నిక్కీ హెలీ' గతంలో సౌత్ కరోలినా గవర్నర్‌గాకూడా సేవలు అందించారు. ట్రంప్ అధ్యక్షుడిగాఉన్న సమయంలో ప్రముఖ పాత్రను నిర్వహించిన హెలీ ప్రస్తుతం అధ్యక్ష పదవికి జరుగనున్న రేసులో ఉన్నారు. పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేసిన అజిత్ సింగ్, దిల్లీ యూనివర్సిటీలో న్యాయపట్టా పొందిన రాజ్‌కౌర్ దంపతులకు 20 జనవరి 1972న వస్త్ర వ్యాపార కుటుంబంలో సౌత్ కరోలినాలో జన్మించిన నిక్కీ తల్లితండ్రులు పంజాబ్‌కు చెందినవారు. తొలుత కెనడాలో పనిచేసిన హెలీ తల్లితండ్రులు 1969 తరువాత అమెరికాలోకి సౌత్ కరోలినాలో స్థిరపడ్డారు. అకౌంటింగ్‌లో యూనివర్సిటీ డిగ్రీపొందిన నిక్కీ హెలీ 1996లో క్రిస్టియన్‌గా మారి మైఖేల్ హెలీని వివాహమాడారు. 2005-11 మధ్య సౌత్ కారోలినా హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్‌గా, 2011-17 వరకు సౌత్ కారోలినా గవర్నర్‌గా, 2017-18 మధ్య ఐరాసలో అమెరికా అంబాసిడర్‌గా సేవలు అందించారు. అట్లాంటిక్ సిటీలో భారతీయ తల్లితండ్రులకు జన్మించిన హర్ష్ వర్థన్ సింగ్ న్యూజెర్సీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి 2009లో ఇంజనీరింగ్ డిగ్రీని పొందారు. జీవితకాలం రిపబ్లికన్‌పార్టీ కార్యకర్తగా కొనసాగుతున్న హర్ష్ వర్థన్ సింగ్ 'అమెరికా ఫస్ట్' అంటూ అభిమానాన్ని ప్రకటించుకుంటున్నారు. వృత్తిరీత్యా ఎరోనాటికల్ ఇంజనీరు అయిన హర్ష్ వర్థన్‌సింగ్ కుటుంబం మసైల్ డిఫెన్స్, సాటిలైట్ నావిగేషన్, ఏవియేషన్ సెక్యూరిటీ రంగాల్లో వ్యాపారం చేస్తున్నారు. 13మార్చి, 1985న జన్మించిన హర్ష్ తన ప్రతిభతో ఏవియేషన్ అంబాసిడర్‌గా అవార్డు పొందిన 38 ఏండ్ల ప్రాయంలో రాజకీయ నాయకుడిగా, ఏరోనాటికల్ ఇంజనీరుగా గుర్తింపు పొందారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థను గుండెల్లో పెట్టుకొని జీవించే విధానమే భారత నినాదం. ప్రేమలు పంచడం, మానవీయ సంబంధాలను అల్లుకోవడం మా అభిమతం. అమ్మ, నాన్న, సోదర సోదరీమణులు, బంధువులు, స్నేహితులకు పెద్దపీట వేయడం మా అలవాటు. పెళ్లిళ్లను పవిత్రంగా భావించడం, కడదాకా దంపతులుగా విడదీయరాని బంధాలను పెనవేసుకోవడం భారత రక్తానికి తెలుసు. ఇలాంటి విశ్వకుటుంబ భావన కలిగిన భారతీయ సంతతికి చెందిన వ్యక్తులు ప్రపంచ దేశాల అధినేతలుగా సేవలను అందించాలని వీరు భావిస్తున్నారు.

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

ఎగుమతుల నిషేధంతో రైతులను బలిపెడతారా !

ఎం కోటేశ్వరరావు

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ తీరు తెన్నులను చూస్తుంటే ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ మూడోసారి అధికారానికి వచ్చేందుకు కోట్లాది మంది రైతాంగాన్ని బలిపెట్టేందుకు పూనుకుందా అంటే అవునని చెప్పాల్సివస్తోంది. తాను చెప్పిన మాటలను తానే దిగమింగి ప్రకటిత విధానాల నుంచి వైదొలగటాన్నిచూసి అనేక మంది అలాగే భావిస్తున్నారు. ఎగుమతి నిషేధాల జాబితాలో ఇక పంచదార వంతు అంటూ ఆగస్టు 23వ తేదీన ఒక వార్త వెలువడింది. అంతకు ఒక రోజు ముందు "రైతులు లాభపడటాన్ని అడ్డుకుంటున్న ప్రభుత్వం" అనే శీర్షికతో డెక్కన్ హెరాల్డ్ పత్రికలో అజిత్ రనడే అనే ఆర్థికవేత్త కేంద్ర ప్రభుత్వ విధానాల గురించి ఒక విశ్లేషణ రాశారు. కేంద్ర నిర్ణయాల మీద వివిధ కోణాల్లో మరికొందరు కూడా రాస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ఉన్న ఆంక్షలన్నింటినీ సడలిస్తామని, ఎలాంటి పరిమితులు విధించబోమంటూ 2018లో కేంద్ర ప్రభుత్వం ఎగుమతి-దిగుమతి విధానంలో పేర్కొన్నది. మూడు సాగుచట్టాలను తీసుకువచ్చి దేశం మీద రుద్దాలని చూసిన సంగతి తెలిసిందే. రైతుల ఆందోళన కారణంగా తప్పనిసరై వాటిని వెనక్కు తీసుకున్నప్పటికీ వాటితో నిమిత్తం లేకుండా అంతకు రెండేళ్ల ముందు ప్రకటించిన ఎగుమతి-దిగుమతి విధానాన్ని కూడా అటక ఎక్కించింది. ఎప్పుడేం చేస్తారో తెలియని ఇలాంటి పాలకులను నమ్మి ఎవరైనా ముందుకు పోగలరా? గడచిన తొమ్మిదేండ్ల పాలనలో ఒకటి స్పష్టం. పారిశ్రామిక, వాణిజ్యవేత్తల మీద ఉన్న శ్రద్ద, ప్రేమ రైతాంగం మీద లేదు. వారికి ఇచ్చినన్ని రాయితీలు, రద్దుచేసిన రుణాలు రైతులకు లేవు.

ఇప్పటి వరకు పంచదార ఎగుమతుల మీద ఆంక్షలు, పరిమితులు మాత్రమే విధించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా నిషేధంవిధిస్తూ నేడో రేపో ప్రకటన చేయనుందని ఆగస్టు 23న రాయిటర్ వార్తా సంస్థ పేర్కొన్నది. అంతకు ముందు వచ్చేసీజన్‌లో 40లక్షల టన్నులకు ఎగుమతులు పరిమితం చేయనున్నట్లు వార్తలు వచ్చాయి. అక్టోబరు ఒకటవ తేదీ నుంచి చెరకు ఆర్థిక సంవత్సరం ప్రారంభమౌతుంది. దేశంలో అనేక ప్రాంతాల్లో తగినంత వర్షపాతంలేని కారణంగా చెరకు దిగుబడి తగ్గవచ్చని అందువలన పంచదార ధరలు పెరగకుండా ఎగుమతులపై నిషేధం విధించవచ్చని ప్రభుత్వ వర్గాలు చెప్పినట్లు వార్తలో తెలిపింది. సెప్టెంబరు 30వ తేదీ వరకు 61లక్షల టన్నుల పంచదార ఎగుమతికి కేంద్ర ప్రభుత్వం మిల్లులకు అనుమతి ఇచ్చింది. గత ఏడాదిలో 111లక్షల టన్నుల ఎగుమతికి అనుమతించారు. వచ్చే రెండు సంవత్సరాల్లో దిగుమతి తగ్గవచ్చని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. మరో నెలరోజుల్లో ముగియనున్న సంవత్సరంలో పంచదార ఉత్పత్తి 3.6 కోట్ల టన్నులు ఉంటుందని అంచనా వేయగా 3.2కోట్లకు మించే అవకాశం లేదని పరిశ్రమ వర్గాలు అంచనా వేశాయి. మన దేశం నుంచి ఎగుమతి లేకుంటే ఇప్పటికే ప్రపంచ మార్కెట్లో పెరిగిన ధరలు మరింత పెరుగుతాయని, బ్రెజిల్ ఎగుమతిదారులు మంచి ధరతో లబ్దిపొందుతారని భావిస్తున్నారు.

2022 ఏప్రిల్ 13న గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లో ఒక భవనాన్ని నరేంద్రమోదీ వీడియో ద్వారా ప్రారంభించారు. ఆ సందర్భంగా సందేశమిస్తూ ఉక్రెయిన్ యుద్ధం తరువాత ఏ దేశానికి ఆ దేశం తన ఆహార భద్రత సంగతి తాను చూసుకుంటోందని తాను ఒకసారి అమెరికా అధినేత జో బైడెన్‌తో మాట్లాడినపుడు ప్రస్తావించానని, ప్రపంచ వాణిజ్య సంస్థ గనుక అనుమతిఇస్తే ప్రపంచానికి ఆహార ధాన్యాలను సరఫరా చేసేందుకు సిద్దంగాఉన్నాం అని చెప్పినట్లు మోదీ ఆ సందర్భంగా వెల్లడించారు. మన జనానికి సరిపడా ఆహారం ఇప్పటికే మన దగ్గర ఉందని, కానీ మన రైతులను చూస్తుంటే ప్రపంచానికే ఆహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా కనిపిస్తున్నదని, ప్రపంచ వాణిజ్యసంస్థ ఎప్పుడు అనుమతిస్తుందో తెలియదు గానీ మనం మాత్రం ప్రపంచానికి ఆహారం అందించగలం అని నరేంద్రమోదీ చెప్పారు. అదే ఏడాది మేనెల నాలుగవ తేదీన ఐరోపాలోని కోపెన్‌హగన్‌లో ఒక సమావేశానికి హాజరైన ప్రధాని మోదీ అక్కడి భారతీయుల సమావేశంలో మాట్లాడుతూ ఆహార ధాన్యాల్లో భారత్ స్వయం సమృద్ధి సాధించిందనీ, ఆకలి నుంచి ప్రపంచాన్ని రక్షించేందుకు ముందుకు వచ్చిందని చెప్పారు.

ప్రపంచ ఆకలి సూచిక 2013లో 78 దేశాల జాబితాలో మనది 63 కాగా శ్రీలంక 43, నేపాల్ 49, పాకిస్తాన్ 57వ స్థానాలతో మన కంటే ఎగువన ఉన్నాయి. 2022లో 121 దేశాలకు గాను 107వ స్థానంలో మన దేశం ఉంది. శ్రీలంక 64, మైన్మార్ 71, నేపాల్ 81, బంగ్లాదేశ్ 84, పాకిస్తాన్ 99 స్థానాల్లో ఉన్నాయి. ఈ వివరాలన్నీ తెలిసిన తరువాత కూడా ప్రపంచ ఆకలి తీరుస్తామని వేదికల మీద చెప్పటం నరేంద్రమోదీకి తప్ప మరొక నేతకు సాధ్యం అవుతుందా ? ప్రధాని మాటల కొనసాగింపుగా అంతకు ముందు ఏడాది చేసిన 20లక్షల టన్నులను 2022-23లో కోటి టన్నులకు పెంచి గోధుమలను ఎగుమతిచేసే లక్ష్యాన్ని సాధించేందుకు ఇండోనేషియా, ట్యునీషియా, మొరాకో, ఫిలిప్పీన్స్,టర్కీ థాయిలాండ్, వియత్నాం, అల్జీరియా, లెబనాన్‌లకు ప్రతినిధి బృందాలను పంపనున్నట్లు మే 12న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ ప్రకటించింది. అంతే కాదు, కొన్ని దేశాలకు ఎగుమతులు ప్రారంభమైనట్లు కూడా చెప్పారు. చిత్రం ఏమిటంటే మరుసటి రోజే గోధుమల ఎగుమతులపై కేంద్రం ఆంక్షలు విధించింది. తరువాత సెప్టెంబరు తొమ్మిది నుంచి అమల్లోకి వచ్చేవిధంగా బాస్మతేతర బియ్యం ఎగుమతులపై ఇరవైశాతం ఎగుమతి పన్ను విధించటంతో పాటు, కొద్దిగా ముక్కలైన బియ్యం ఎగుమతులపై కూడా పూర్తి నిషేధం విధించారు. ప్రభుత్వ నిర్ణయంతో ఓడలకు ఎక్కించేందుకు వివిధ రేవుల్లో ఉన్న ఐదు లక్షల టన్నుల గోధుమలను ఎగుమతిదార్లు వెనక్కు తీసుకువచ్చి మార్కెట్లో అమ్మేందుకు పూనుకోవటంతో మార్కెట్లో పది-పదిహేను శాతం ధరలు పడిపోయాయి. దాంతో ఎగుమతిదార్ల వత్తిడికి లొంగి రేవుల్లో నమోదైన మేరకు ఎగుమతులు చేసుకోవచ్చని ప్రభుత్వం ఉత్తరువులను సవరించింది. మొత్తం మీద రైతులు పెద్ద ఎత్తున నష్టపడ్డారు. ఈ ఏడాది తాజాగా గోధుమ పిండి, మైదా, గోధుమ రవ్వ ఎగుమతులను కూడా నిషేధించింది. అంతే కాదు ఇప్పటికే రష్యా నుంచి తక్కువ ధరలకు ముడి చమురు దిగుమతి చేసుకుంటున్న మన దేశం ఇప్పుడు గోధుమలను కూడా దిగుమతి చేసుకోవాలని చూస్తోంది. టన్నుకు 25 నుంచి 40 డాలర్ల వరకు తక్కువకు దిగుమతి చేసుకోవచ్చని వార్తలు వచ్చాయి. స్థానిక మార్కెట్లో పెరిగిన ధరలను తగ్గించేందుకు అని చెబుతున్నారు. ఇదంతా త్వరలో జరిగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, తదుపరి జరిగే లోకసభ ఎన్నికల నాటికి ధరలను తగ్గించామని జనం ముందు చెప్పుకొనేందుకు తప్ప వేరు కాదన్నది స్పష్టం. ఉల్లి ధరల పెరుగుదల సూచన కనిపించటంతో వాటి ఎగుమతులపై 40 శాతం పన్ను విధించుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో నాసిక్ ప్రాంతంలోని వ్యాపారులు ఉల్లి కొనుగోళ్లను నిలిపివేశారు. క్వింటాలు రు.2,410 రూపాయల ధరతో తాము కొనుగోలు చేస్తామని కేంద్ర మంత్రి పియుష్ గోయల్ ప్రకటించారు. ఎగుమతులు లేక కేంద్రం దిగుమతులు చేసుకుంటే తాము కొన్న ధరలకంటే మార్కెట్లో తగ్గితే నష్టపోతామన్న భయంతో వారు మానుకున్నారు. ధరలు పెరిగినపుడు కొద్ది నెలలు ఉల్లి తినటం మానుకుంటే సరి అధిక ధరలకు ఎవరు కొనమన్నారు అంటూ మహారాష్ట్ర బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వమంత్రి దాదా భూసే అన్నారు. 2019లో ఉల్లి ధర కిలో రు.100కు చేరినపుడు నేను ఉల్లిపాయలు తినను అని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్న సంగతి తెలిసిందే. ఉల్లి ధరలను ఎన్నికల ప్రచార అస్త్రంగా మార్చిన గతం బిజెపికి గుర్తుకు వచ్చి ముందు జాగ్రత్తపడుతున్నది. కానీ నష్టపోతున్నది రైతులే. ధరలు పతనమైనపుడు కేంద్ర ప్రభుత్వం క్వింటాలు రు.2,410కి కొన్న దాఖలా లేదు.

ఎవరు దేశభక్తులు? ఎవరు దేశద్రోహులు?

డాక్టర్ దేవరాజు మహారాజు

ప్రస్తుతం కేంద్రంలో అది కారంలోఉన్న ప్రభుత్వం 'వికాస్' అనేమాట తరచూ మాట్లాడుతూ ఉంది. అది అణగారిన వర్గాల రక్త మాంసాల్ని, మైనారిటీల అస్థి పంజరాల్ని కార్పొరేట్ శక్తులకు నైవేద్యంపెడుతూ దేశాన్ని ప్రగతి మార్గంలో నడిపిస్తోంది? దేశం లోని ప్రతి సగటు మనిషి గుండెమీద చేయి వేసుకుని, తమకు తిండి, బట్ట దొరుకుతున్నాయా? అని తమపిల్లలకు సరైన చదువు చెప్పించగలుగుతున్నామా? అని ప్రశ్నించుకోవల్సిన సమయంవచ్చింది. ఈ దేశప్రజలకు ఆరోగ్య సదుపాయం, రవాణా సౌకర్యాలు సరిగా అందుతున్నాయా? యువతకు ఉపాధి లభిస్తోందా? రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకోగలుగుతున్నారా? అని ఆలోచించు కోవాల్సిన సమయం వచ్చింది. దేశ ప్రజల్ని మతాల ప్రాతిపదికన, కులాల ప్రాతిపదికన, ఆర్థిక స్థోమతల ప్రాతిపదికన విభజించి పాలిస్తూ 'దేశ్‌క వికాస్' ఎలా తేగలుగుతున్నారో ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాం. బ్రిటీష్ వాడు విభజించి పాలించాడంటే అర్థం చేసుకోవచ్చు. వాడు విదేశీయుడు. ఇప్పుడు మరివీరికేమైంది? అందరం ఈ దేశ వాసులమే కదా? మరి, ఈ దేశ ప్రజలకు ఏమైందీ? స్వాతంత్ర్యానంతరం దేశంలో విద్యావంతుల సంఖ్య గణనీయంగా పెరిగింది కదా? వారు చదివిన చదువులు ఎందుకు వారిలో వివేకం పెంచలేకపోతు న్నాయి? కుటుంబ బాధ్యతలే నిర్వహించుకోలేని సన్యాసులు చేతికి అధికార పగ్గాలు ఎలా ఇస్తున్నారూ? ఎందుకు ఇస్తున్నారూ? కమాన్, మమ్మల్ని దోచుకోండి! కమాన్, మమ్మల్ని అణగదొక్కండి! కమాన్ మా బతుకుల్ని దుర్భరం చేయండి అని అసమర్థులకు ఎందుకు లైసెన్స్ ఇస్తున్నారూ? ప్రభు త్వాధినేతలు చెప్పే అబద్ధాల 'భాషణ్'లలో మిత్రో..ఏమిటీ? అంత తీపి దనం ఉందా? మీ తెలివితేటల్ని, శక్తిని వాళ్లు ఆవు మూత్రంతో శుద్ధి చేస్తుంటే అంత మజా వస్తోందా? తినిపించే ఆవుపేడ అంత రుచిగా ఉందా? ఏమిటీ కారణం? ఎందుకు దేశ పరిస్థితి పడిపోయిన రూపాయి విలువలాగా హంగర్ ఇండెక్స్‌లో చివరికి చేరిన స్థానంలాగా ఈ దేశ ప్రజల విజ్ఞత ఎందుకు పడిపోతూ ఉంది? జ్ఞానేంద్రియాలన్నింటినీ మూసిపెట్టుకుని ఎందుకు ఈ దేశ ప్రజలు అజ్ఞానికి, మూర్ఖత్వానికి పట్టం కడుతున్నారు? ఆలోచించుకోవలసిన సమయం వచ్చింది. దేశభక్తుడు షహీద్ భగత్‌సింగ్ ఎందుకు గుర్తుకు రావడంలేదూ? ఈ దేశాన్ని రక్షించుకోడానికి రక్తం చిందించిన అమరవీరులైన దేశభక్తులెవరూ ఎందుకు గుర్తుకు రావడం లేదూ? ఎందుకు దేశ ద్రోహులను, మోసగాళ్లను గద్దెనెక్కిస్తున్నారూ? మనం ఒక హిందు, ఒక ముస్లిం, ఒక క్రైస్తవుడిగా పుట్టడమన్నది యాదృచ్ఛికం. ఎవరు, ఎక్కడ, ఏ ప్రాంత ంలో పుట్టాలన్నది ఎవరి ఆధీనంలోనూ ఉండదు కదా? ఏది ఏమైనా, అందరం ఈ దేశ వాసులం. భారతీయులం. అంతకన్నా ముఖ్యం అందరం మనుషులం! తేడా లెందుకూ? విభజన లెందుకూ? కుట్ర పూరితంగా విభజనలు ప్రోత్సహించేవారి ఆట కట్టించాలి కదా? అబద్ధాలు చెపుతూ పుకార్లు ప్రచారం చేసేవారి భరతం పట్టాలికదా? కరోనా కష్టకాలంలో లక్షల మంది వలస కార్మికులకు కనీసం రైలు, బస్సు సౌకర్యం కల్పించలేని ప్రభుత్వ అసమర్థత ఎందుకు కనిపించడం లేదూ? లక్షల కోట్లు బ్యాంకు దోపిళ్లు చేసినవారిని మాత్రం భద్రంగా దేశం దాటిస్తారా? అదే ఈ దేశ చౌకీదారు చేయాల్సిన పని? అధిక సంఖ్యాకులైన సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపలేని 'ప్రజాసేవకులు' మనకు అవసరమా? ఈ దేశంలోని యువతరాన్ని సంభోదిస్తూ దేశభక్తు షహీద్ భగత్‌సింగ్ చెప్పిన మాటలు ఇలా ఉన్నాయి. "భారత రిపబ్లిక్‌లోని యువతీ యువకులారా! సిపాయిలారా! విశ్రాంతిగా, నిరర్థకంగా నిలబడకండి. అడుగులో అడుగువేస్తూ కార్యోన్ముఖులు కండి. తీవ్రమైన ఆకలి,పేదరికం, మీకు సవాలు విసురుతోంది! దాన్ని తిప్పి కొట్టాల్సిఉంది. మీరొక మంచి మిషన్ (ధ్యేయం) లో నిమగ్నమై ఉన్నారు. దేశం అన్ని వైపులా, అన్ని మూలల్లో, విప్లవజ్వాలలు అంటుకుంటున్నాయి. ప్రజల్ని సమాయత్తం చేయండి. మీ ధ్యేయం వినిపిస్తున్న బిగుల్ ధ్వని (యుద్ధ భేరి) వినండి. విని కదలండి. ఇలాగే నిశ్చేష్టులై నిస్సారంగా జీవితం గడపకండి" భగత్‌సింగ్ ఆయన కాలంలో చెప్పిన మాటలు ఈ కాలానికి కూడా పనికొస్తాయి. అందువల్ల ఆయన కన్న కలల్ని నిజం చేయాల్సిన బాధ్యత ఈ తరం యువతీ యువలకుల మీద ఉంది. వారంతా తీవ్రంగా ఆలోచించాలి. లేవాలి. లేచి, కార్యాచరణకు పూనుకోవాలి. లేకపోతే ఇంకా ఇంకా నష్టం జరిగిపోతుంది. ఆ తర్వాత పశ్చాత్తాపంలో కుమిలిపోయినా లాభం ఉండదు. జరుగుతున్న అన్యాయాల సెగ మనకు తగలడం లేదు కదా అని తమాషా చూస్తూ ఉంటే, ఆ తర్వాత మన గురించి గొంతెత్తేవారే ఉండరు. సంఘ్‌పరివార్, బీజేపీలు కలిసి ఆ హిట్లర్ పథకాన్ని ఈ దేశంలో అమలు చేయాలని అనుకుంటున్నప్పుడు దేశప్రజలు ఏం చేయాలి? అన్యాయాల మీద, అబద్దాల మీద, అరాచకాల మీద, అజ్ఞానం మీద, మూర్ఖత్వం మీద, పుకార్లమీద, కుట్రల మీద, మనుషుల విభజన మీద తీవ్రంగా విరుచుకుపడాలి కదా? ఓర్చుకుని, నోరు మూసుకుంటే అది మరింత వినాశనానికే దారితీస్తుంది. మానవజాతి అంతా ఒక్కటే అయినప్పుడు, ఈ దేశవాసుల్లోనే కొందరు మనవారు కొందరు పరాయివారు ఎలా అవుతారు? మన అన్నాతమ్ముళ్లు , అక్కా చెల్లెళ్లు ఉత్తపుణ్యానికి చనిపోతూఉంటే, విభజించి పాలిస్తున్న ఈ పాలకులు గొప్పపాలన అందిస్తున్నారని మనమిక్కడ వేడుకలు చేసుకుందామా? దేశభక్తులు షహీద్ భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురూలు 20 మార్చి 1931న పంజాబ్ గవర్నర్‌కు ఒక లేఖ పంపించారు. అందులోని సారాంశం ఇలా ఉంది. "మేం చెప్పదల్చుకున్నదేమంటే, ఇక్కడ యుద్ధం ప్రారంభంకానే అయ్యింది. శ్రామికుల శ్రమ శక్తిని అన్యాయంగా దోచుకుని బలిసిపోతున్న కార్పొరేట్లకు వ్యతిరేకంగా ఈ యుద్ధం కొనసాగుతుంది. దోచుకునే కార్పొరేట్లు బ్రిటీష్ వారయినా, స్వదేశీయులైనా మాకు ఒక్కటే-వాళ్లంతా ఒక్కటై సామాన్యుల నడ్డి విరుస్తున్నారు. జీవితాలు దుర్భరం చేస్తున్నారు. అందుకే చెపుతున్నాం. దోపిడీని, అణచివేతను ఇక ఎంత మాత్రం సహించం. రక్తం తాగేవారు స్వదేశీయుడైతే నేమిటీ? విదేశీయుడైతే నేమిటీ? మాకు అందరూ శత్రువులే" ఆనాడు ఆ దేశభక్తులు వెలిబుచ్చిన ఆవేదనను ఇప్పుడు ఈ దేశప్రజలందరూ మళ్లీ వెలిబుచ్చాల్సిన అవసరం వచ్చింది.

"ఒకప్పుడు జర్మనీలో జరిగినట్టుగానే ఇక్కడ భారతదేశంలో బీజేపీ ప్రభుత్వం అసలు సమస్యల నుండి దృష్టి మరల్చడానికి మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ఉంది" అని అన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షులైన జస్టిస్ మార్కండేయ కట్జూ. ఐన్‌స్టీయిన్ లాంటి మహా శాస్త్రవేత్త, గోథే లాంటి మహారచయిత, బెథోవెన్ వంటి మహా సంగీతకారుడు, కాంట్, నీషే, మార్క్స్ లాంటి గొప్ప తత్వవేత్తలు అందరూ జర్మన్లే. కాని1999లో జర్మనీ-హిట్లర్ అధీనంలోకి రాగానే, పరిస్థితుల్ని పూర్తిగా మార్చేశాడు. సమస్యలన్నింటికీ యూదులే కారణమని ప్రచారం చేశాడు. ఆలోచనా పరుల మెదళ్లలో కూడా విషం నింపాడు. ఫలితం ఏమైంది? సుమారు 60 లక్షల మంది యూదులను గ్యాస్ ఛాంబర్‌లోకి పంపి హత్య చేయించాడు. చరిత్రపుటల్లో కనీవినీ ఎరగని దుర్మార్గం అక్కడ జరిగిపోయింది. పోలికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అదే ఫాసిజం ఇక్కడ ఈ దేశంలో విలయతాండవం చేస్తోంది. తమకుతాము దేశ భక్తులమని ప్రకటించుకున్నవారు, దేశ స్వాతంత్ర్యానికి ముందుగానీ తర్వాతగానీ వారు చేసేదంతా దేశద్రోహమే...నన్నది తేలిపోయిన తర్వాత, రగిలిపోతున్న ఈ దేశ ప్రజలు ఆచరణలోకి దిగకుండా ఉంటారా? సామాన్యుల సంఘటిత శక్తిని తక్కువగా అంచనావేసే ఈ పాలకులే భవిష్యత్తులో అవహేళనకు గురికాబోతున్నారు. నియంతలకు చరిత్ర ఏ గతి పట్టిస్తూ వచ్చిందో మనకందరికి బాగా తెలుసు!

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డువిజేత, జీవశాస్త్రవేత్త

2047కి 'రియల్టీ' బూమ్

న్యూఢిల్లీ: భారత రియల్ ఎస్టేట్ రంగం భారీగా విస్తరించనుంది. గత ఏడాది ఈ మార్కెట్ లావాదేవీలు 477 బిలియన్ డాలర్లుగా ఉంటే, 2047 నాటికి 12 రెట్ల వృద్ధితో 5.8 లక్షల కోట్ల డాలర్లుకు వృద్ధి చెందుతోందని నరెడ్కో-నైట్ ఫ్రాంక్ నివేదిక తెలియజేసింది. భారత రియల్ ఎస్టేట్: విజన్ 2947 పేరుతో రియల్టర్ల మండలి నరెడ్కో ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా ఒక నివేదికను విడుదల చేశాయి. ప్రస్తుతం దేశ జీడీపీలో రియల్ ఎస్టేట్ మార్కెట్ 7.3 శాతం వాటా కలిగి ఉండగా, 2047 నాటికి 15.5 శాతానికి చేరుకుంటుందని ఈ నివేదిక అంచనా వేసింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వందేళ్లకు దేశ జీడీపీ 33 ట్రిలియన్ డాలర్ల నుంచి 40 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని పేర్కొంది. నివాస గృహాల మార్కెట్ 299 బిలియన్ డాలర్ల నుంచి 3.5 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని తెలిపింది. ఆఫీస్ రియల్ ఎస్టేట్ మార్కెట్ విలువ 40 బిలియన్ డాలర్ల నుంచి 473 బిలియన్ డాలర్లకు, వేర్ హౌసింగ్ మార్కెట్ విలువ 2.9 బిలియన్ డాలర్లకు విస్తరించిందని వెల్లడించింది. 2023 సంవత్సరంలో రియల్ ఎస్టేట్ మార్కెట్లో ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడుల గత ఏడాదితో పోలిస్తే 5 శాతం పెరిగి 5.6 బిలియన్ డాలర్లుగా ఉండొచ్చని అంచనా వేసింది.

అదానీ అక్రమాల చిట్టా విప్పలేని సెబీ: కాంగ్రెస్

న్యూఢిల్లీ: అదానీ గ్రూపు మనీలాండరింగ్ వ్యవహారంలో సెబీ ఎలాంటి నిర్ధారణకు రాకపోవడం ఆ సంస్థ అసమర్థతకు అద్దంపడుతోందని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టుకు సెబీ సమర్పించిన స్టేటస్ రిపోర్టులోని అంశాలు ఆందోళన కలిగిస్తున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఆయన శనివారం ఓ ప్రకటనలో ప్రధాని మోదీకి ప్రియమైన వాణిజ్య సంస్థకు ప్రభుత్వ నిబంధనలు, నియమాలు ఏ విధంగా తోడ్పడ్డాయన్నది సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) మాత్రమే పరిశీలించగలదని కోర్టుకు సెబీ నివేదించిందన్నారు. ఈ మేరకు నివేదికను ఎక్స్ మాధ్యమంగా పంచుకున్నారు. అదానీ అక్రమాలకు సంబంధించిన 24 వ్యవహారాలను సెబీ విచారించగా, ఇంకో రెండు ఇంటిరిమ్ స్టేటస్ దశలో ఉన్నాయని వెల్లడించారు. వీటిలో ఒకటి భద్రతా ఒప్పందాల (నియంత్రణ) నిబంధనల్లోని 19ఏ కింద కనీస ప్రభుత్వ వాటా అవసరాన్ని అదానీ గ్రూపు ఉల్లంఘించిందా అన్న కీలకప్రశ్నకు సంబంధించినదిగా జైరాం రమేశ్ తెలిపారు. నిధులిచ్చే విదేశీ యాజమాన్యాల వివరాలను తొలగించాలని 2019లో సెబీ తీసుకున్న నిర్ణయానికి భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఏడాది జూన 28న జరిగిన సెబీ బోర్డ్ సమావేశం అనంతరం కచ్చితమైన రిపోర్టింగ్ నిబంధనల పునరుద్ధరణ ద్వారా తప్పు చేసినట్లు రెగ్యులేటరీ ఒప్పుకొన్నదని చెప్పారు. అదానీ అక్రమాలపై కీలకప్రశల మీద తుది నివేదికలు వెలువడలేదని, సెబీ ఆ పనిని పూర్తి చేయగలదా? రూ.20వేలకోట్ల బినామీ విదేశీ నిధుల మూలాలను గుర్తించగలదా? అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. కాగా, 'హిండెన్‌బర్గ్' ఆరోపణలను అదానీ గ్రూపు కొట్టిపారేసిన విషయం విదితమే.

భావితరాలకు స్ఫూర్తినిచ్చేందుకే...
జాతీయ అంతరిక్ష దినంపై అమిత్‌షా



న్యూఢిల్లీ: భారత విజయాలను భావితరాలకు తెలియజేసి, విజయశిఖరాలను చేరుకునేలా వారిలో స్ఫూర్తి నింపేందుకేనని జాతీయ అంతరిక్ష దినం దోహదమవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. ఇదే ఉద్దేశంతో చంద్రయాన్-3 విజయంతో చరిత్ర సృష్టించిన ఆగస్టు 23వ తేదీన ప్రతిఏటా నేషనల్ స్పేస్ డే పాటించాలని ప్రధాని పిలుపునిచ్చారని చెప్పారు. నిజమైన నాయకుడు అన్నివేళలా ప్రజలతో ఉంటాడని, గ్రీస్ నుంచి మోదీ నేరుగా బెంగళూరు వెళ్లి ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించడమే ఇందుకు నిదర్శనమన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో కొత్త శిఖరాలను అధిరోహించేలా భారత శాస్త్రవేత్తలకు మరింత స్ఫూర్తి అందించేందుకు 'అంతరిక్ష దినోత్సవం' నిర్ణయం దోహదమవుతుందని అభిప్రాయపడ్డారు. చంద్రయాన్-3 విజయంతో భారత శాస్త్రవేత్తలు చరగని ముద్రవేశారన్నారు. ఈ విజయానికి గుర్తుగా చంద్రయాన్ 3 దిగిన ప్రాంతాన్ని 'శివశక్తి'గా, చంద్రయాన్-2 పడిన స్థలాన్ని 'తిరంగా'గా మోదీ నామకరణం చేశారు.

నైజీన్ సరస్సులో సోనియా బోట్ షికారు

శ్రీనగర్: కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు, ఆ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ శనివారం ఉదయం జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్ సిటీకి చేరుకున్నారు. ఇది కేవలం కుటుంబ పర్యటన మాత్రమేనని, ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు ఆమెకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. పార్టీ శ్రేణులతో కాసేపు మాట్లాడిన ఆమె అనంతరం నైజీన్ సరస్సును సందర్శించారు. ఇంజిన్ బోటుపై ఆ సరస్సులో చక్కెర్లు కొట్టారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ కూడా ప్రస్తుతం శ్రీనగర్‌లోనే ఉన్నారు. ఇటీవల లడఖ్‌లో పర్యటించిన రాహుల్ శుక్రవారం ఉదయం కార్గిల్‌లో బహిరంగ ర్యాలీని పూర్తి చేసుకొని శ్రీనగర్‌కు చేరుకున్నారు. మరోవైపు ఆయన సోదరి ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రాతో కలిసి శ్రీనగర్‌కు చేరుకోనున్నారు. వీరంతా రెండు రోజుల పాటు శ్రీనగర్‌లో గడిపి అక్కడి నుంచి గుల్మార్గ్‌కు వెళతారు. గత కొన్నేళ్లుగా శ్రీనగర్‌లోని 'రైన్‌వారి' ప్రాంతంలోని ఓ హోటల్‌లో రెండు రాత్రులు నిద్ర చేయడం ఈ కుటుంబానికి సెంటిమెంట్‌గా వస్తోంది. ఈ సారి రాహుల్ గాంధీ నైజీన్ సరస్సులోని బోట్ హౌస్‌లో ఉంటారని సమాచారం. మిగతా కుటుంబ సభ్యులు మాత్రం వారి సెంట్‌మెంట్ మేరకు పాత హోటల్‌లోనే బస చేయనున్నారు.

మధ్యప్రదేశ్ మంత్రివర్గంలో ముగ్గురికి చోటు
పదవిలో ఉండేది మూడు నెలలే

భోపాల్: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ శనివారం మంత్రివర్గాన్ని విస్తరించారు. కొత్తగా ముగ్గురికి కేబినెట్‌లో స్థానం కల్పించారు. వారిలో ఇద్దరుకి కేబినెట్ పదవులు దక్కగా, మరొకరికి సహాయ మంత్రి హోదా లభించింది. వీరితో గవర్నర్ మంగుభాయ్ పటేల్ రాజ్‌భవన్‌లో ప్రమాణం స్వీకారం చేయించారు. దీంతో చౌహాన్ కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 31 నుంచి 34కు పెరిగింది. కొత్త మంత్రులు మూడు నెలల మాత్రమే ఆ పదవిలో ఉండనున్నారు. ఎందుకంటే మరో 90 రోజుల్లో సీఎం చౌహాన్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం గడువు ముగియనుంది. మంత్రివర్గ విస్తరణపై ప్రతిపక్ష కాంగ్రెస్ విమర్శనాస్త్రాలు సంధించింది. కొత్తమంత్రులను వెయ్యి గంటల మంత్రులుగా ఎద్దేవా చేసింది. మరికొన్ని రోజుల్లో ప్రభుత్వ గడువు ముగియనుండగా మంత్రివర్గాన్ని విస్తరించారని మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ విమర్శించారు. వీడ్కోలు సమయంలో బీజేపీ ప్రభుత్వం స్వాగతం పాటలు పాడుతున్నదని ఎద్దేవాచేశారు. మొత్తం కేబినెట్ మారుతుందని స్పష్టం చేశారు. ఇది మంత్రివర్గ విస్తరణ కాదని, అవినీతి దోస్తాన్ విస్తరణ అని కమల్‌నాథ్ పేర్కొన్నారు.

ఉప్పుడు బియ్యంపై 20 శాతం సుంకం

న్యూఢిల్లీ: దేశీయంగా తగినంత నిల్వ ఉంచడం, ధరలను అదుపులో ఉంచడం లక్ష్యంగా కేంద్రం ఉప్పుడు బియం ఎగుమతిపై 20 శాతం సుంకాన్ని విధించింది. ఆగష్టు 25న విధించిన ఎగుమతి సుంకం అక్టోబర్ 16, 2023 వరకు అమలులో ఉంటుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌లో తెలిపింది. లియో (లెట్స్ ఎక్స్‌పోర్ట్ ద ఆర్డర్- ఎగుమతి ఆర్డర్‌ను అనుమతించడం) మంజూరు చేయని, ఆగష్టు 25, 2023కి ముందు చెల్లుబాటు అయ్యే ఎల్‌సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ద్వారా మద్దతునిచ్చే కస్టమ్స్ పోర్టులలో పడి ఉన్న ఉప్పుడు బియ్యంపై సుంకం మినహాయింపు మాత్రం అమలులో ఉంటుంది. ఈ నియంత్రణలతో భారత్ ఇప్పుడు బాస్మతీయేతర బియ్యంపూ అన్ని రకాల ఆంక్షలు విధించింది. దేశం నుంచి ఎగుమతి అవుతున్న మొత్తం బియ్యంలో బాస్మతీయేతర తెల్ల బియ్యం 25 శాతంగా ఉంది. దేశీయ సరఫరా పెంచడానికి, రాబోయే పండుగ సీజన్‌లో రిటైల్ ధరలను అదుపులో ఉంచడానికి గత నెలలో ప్రభుత్వం బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగుమతులను నిషేధించింది. గతేడాది సెప్టెంబరులో విరిగిన బియ్యం ఎగుమతులు నిషేధించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో బాస్మతీయేతర తెల్ల బియ్యం 15.54 లక్షల టన్నులు ఎగుమతి కాగా, అంతకు ముందు ఏడాది ఇదే కాలంలో 11.55 లక్షల టన్నులు మాత్రమే ఎగుమతి అయింది. ఆహార ధాన్యాల ధరల ఎగుమతులపై నిషేధం విధించారు. వార్షిక రిటైల్ లేదా వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం జూన్‌లో 4.87 శాతానికి వ్యతిరేకంగా జులైలో 15 నెలల గరిష్ట స్థాయి 7.44 శాతానికి చేరుకుంది. దేశీయంగా లభ్యతను పెంచేందుకు ఉల్లిపై వారం రోజుల క్రితం మనదేశం 40 శాతం ఎగుమతి సుంకాన్ని విధించింది. భారతదేశ మొత్తం బాస్మతి బియ్యం ఎగుమతుల ధర పరంగా 2022-23లో 4.8 బిలియన్ డాలర్లు. అయితే పరిమాణం పరంగా 45.6 లక్షల టన్నులు. ఇదే కాలంలో బాస్మతీయేతర బియ్యం ఎగుమతులు 6.36 బిలియన్ డాలర్లు...పరిమాణం పరంగా 177.9 లక్షల టన్నులు.

ముస్లిం విద్యార్థిని కొట్టండి

- యూపీలో ప్రైవేట్ పాఠశాల టీచర్ తీరు
- విద్యార్థులకిదేనా నేర్పేదని నెటిజన్ల ప్రశ్న

లక్నో: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంలో మైనారిటీలపై వివక్ష పాఠశాలలకు కూడా పాకింది. ఒక టీచర్ ముస్లిం విద్యార్థిని చెంప దెబ్బలు కొట్టాలంటూ తోటి విద్యార్థుల్ని ప్రోత్సహించారు. ముజఫర్‌నగర్‌లో ఒక ప్రైవేట్ పాఠశాలలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఈ వీడియోపై పోలీసులు విచారణ చేపట్టారు. టీచర్‌పై చర్యలు చేపట్టాలని విద్యాశాఖను కోరినట్లు పోలీసులు తెలిపారు. ఆ విద్యార్థిపై టీచర్ కొన్ని మతపరమైన వ్యాఖ్యలు కూడా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ముస్లిం విద్యార్థి ఎక్కాలు నేర్చుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర విద్యార్థులను చెంప దెబ్బలు కొట్టాలని ఆదేశించారు. ముస్లిం పిల్లల తల్లితండ్రులను ఉద్దేశిస్తూ ఆ టీచర్ కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఈ టీచర్ వ్యవహరించిన తీరు సభ్య సమాజం సిగ్గుపడేలా చేసింది. మతం పేరుతో ఒక పిల్లాడిని తన తోటి విద్యార్థులతో కొట్టించి ఆ టీచర్ పైశాచిక ఆనందం పొందిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. విద్యాబుద్ధులు నేర్పాల్సిన టీచర్ ఇలా విచక్షణ లేకుండా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కులానికి, మతానికి తావు లేని ఒక పవిత్ర ప్రదేశం పాఠశాల. అలాంటి పాఠశాలలో పరమత ద్వేషంతో విద్యార్థుల మెదళ్లలో మత మౌఢ్యాన్ని నింపుతున్న ఇలాంటి టీచర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేశారు. ఈ ఘటన ఎప్పుడు జరిగిందో తెలియదు గానీ ఎక్కడ జరిగిందనే విషయ ంపై స్పష్టత వచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ తాలూకాలోని ఖుబ్బాపూర్ గ్రామంలోని పాఠశాలలో ఈ ఘటన జరిగింది. ఆ టీచర్ పేరు త్రిప్త త్యాగి అని తెలిసింది. వీడియోలో పాపం అమాయకంగా నిల్చుని దెబ్బలు తిన్న ఆ బాలుడు ఒక రైతు కొడుకు. ఆ బాలుడి తండ్రి పేరు ఇర్షాద్ అని తెలిసింది. నిల్చుని ఉన్న ఆ విద్యార్థిని తొలుత అతని కంటే తక్కువ వయసున్న ఒక పిల్లాడు చెంపదెబ్బ కొట్టాడు. ఆ తర్వాత మరో ఇద్దరు విద్యార్థులు ఆ విద్యార్థిని కొట్టారు. పాపం తనతో రోజూ ఆడుకుంటున్న పిల్లలే కొట్టడంతో ఆ విద్యార్థి ఏడుస్తూ కనిపించిన దృశ్యం గుండె తరుక్కుపోయేలా చేసింది. మతం అంటే ఏంటో కూడా తెలియని మిగతా విద్యార్థులు అమాయకంగా చూస్తూ ఉన్నారు. అక్కడున్న విద్యార్థినీవిద్యార్థులంతా పదేళ్ల వయసు లోపు పిల్లలు. అంత చిన్న వయసులో ఉన్న పిల్లల మెదళ్లలో సదరు టీచర్ మతం పేరుతో విషబీజాలు నాటడం శోచనీయం. ఈ ఘటన ఎప్పుడు జరిగిందో తెలియదు గానీ వీడియో ముజఫర్‌నగర్ పోలీసుల దృష్టికి కూడా వెళ్లింది. ట్విటర్ వేదికగా పోలీసులు కూడా ఈ ఘటనపై స్పందించారు. ఈ ఘటనపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటా మని స్పష్టం చేశారు. ఆ టీచర్‌ను వెంటనే ఉద్యోగం నుంచి తొలగించి కఠిన చర్యలు తీసుకోవాలని వీడియో చూసిన నెటిజన్లు డిమాండ్ చేశారు.

బీజేపీ విద్వేష రాజకీయాల పర్యవసానమే...
ముజఫర్‌నగర్‌లో ముస్లిం బాలుడికి చెంపదెబ్బలపై ఖర్గే

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్, ముజఫర్‌నగర్‌లో ముస్లిం బాలుడికి చెంపదెబ్బల ఘటన వెనుక మతవివక్ష, బీజేపీ-ఆర్ఎస్ఎస్ విద్వేష రాజకీయాలు ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం విమర్శించారు. రెండో తరగతి బాలుడిని చంపదెబ్బలు కొట్టాలని తోటి విద్యార్థులకు స్కూలు టీచరు పురమాయించడం, బాలుడి మతాన్ని దూషించడానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. టీచరు ప్రోద్బలంతో తరగతి విద్యార్థులు కలిసి ముస్లిం విద్యార్థి చెంపలు వాయించడాన్ని అన్ని రాజకీయ పార్టీలు తీవ్రంగా ఆక్షేపించాయి. ఖర్గే స్పందిస్తూ బీజేపీ ప్రోత్సహించే విద్వేష రాజకీయాల పర్యవసానమే ఇదంతా అని ఘాటుగా విమర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్ఠను దిగజార్చే ఇటువంటి ఘటనల్లో దోషులకు తగిన శిక్ష విధిస్తే మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా ఉంటాయని అన్నారు. ఈ ఘటనలు రాజ్యాంగానికి విరుద్ధమని ఖర్గే ట్వీట్ చేశారు. మతం పేరిట నలుగురిని ఆర్‌పీఎఫ్ జవాన్ కాల్చి చంపిన ఘటనను కూడా గుర్తుచేశారు. అధికార పార్టీ మత వివక్ష, విద్వేష రాజకీయాలు, విభజన ఆలోచన దుష్ప్రభావాలే ఇటువంటి ఘటనలని ఖర్గే వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా ఎక్స్ మాధ్యమంగా స్పందిస్తూ బీజేపీ పోసిన కిరోసిన్‌తో దేశంలోని ప్రతి మూల మండుతోందని వ్యాఖ్యానించారు. పిల్లలు భావిభారత పౌరులు. వాళ్లను ద్వేషించొద్దు. మనమంతా కలిసికట్టుగా ప్రేమను పంచుదాం, ప్రేమించడాన్ని నేర్పుదాం' అని ట్వీట్ చేశారు. ఖుబ్బాపూర్ గ్రామంలోని ప్రైవేటు స్కూలులో రెండో తరగతి విద్యార్థులను తోటి ముస్లిం విద్యార్థిని కొట్టమని ఆదేశించిన టీచర్‌ను త్రిప్తి త్యాగిగా గుర్తించారు. త్యాగిపై శనివారం ఎఫ్ఐఆర్‌ను ముజఫర్ పోలీసులు నమోదు చేశారు. అయితే ఆమెపై ఎలాంటి ఆరోపణలు మోపారన్నది తెలియాల్సి వుంది.

80 ఏళ్ల వృద్ధులు ఇంటి నుంచే ఓటు

- చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో అమలు
- భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ వెల్లడి

రాయ్‌పూర్: కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతానికి పైగా అంగవైకల్యం గల వారికి ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించింది. ఈ ఏడాది జరిగే చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల నుంచే దీనిని అమలు చేయనున్నది. 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 40శాతం పైగా అంగవైకల్యం గల వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నట్లు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ శనివారం చెప్పారు. చత్తీస్‌గఢ్‌లో రెండు లక్షలకు పైగా 80 ఏళ్ల వయస్సు పైబడిన వ్యక్తులు ఉన్నట్లు ఆయన తెలిపారు. 'వయోవృద్ధులకు ఇంటి నుంచి ఓటు వేసే సదుపాయం కల్పిస్తున్నాం. అంగవైకల్యం గల వారికి సైతం ఈ అవకాశం ఇస్తున్నాం. ఇందుకుగాను ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన ఐదు రోజుల్లో 12 డి ఫారం నింపి పంపాల్సి ఉంటుంది' అని రాజీవ్‌కుమార్ ఇక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడం, తిరిగి ఇంటికి తీసుకెళ్లే సదుపాయాలు కూడా కల్పిస్తామని కుమార్ చెప్పారు. అత్యంత వెనుకబడిన గిరిజన గ్రూపులను ఓటర్లుగా చేర్చడానికి ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సెప్టెంబరు 11వ తేదీ వరకు పొడిగించినట్లు కుమార్ వెల్లడించారు. ఎన్నికల్లో మద్యం, నగదు, కానుకలు, డ్రగ్స్‌ను కట్టడి చేసేందుకుగాను సీసీటీవీ కెమెరాలు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాజీవ్‌కుమార్ నాయకత్వంలోని ఈసీఐ బృందం రాజకీయ పార్టీలు, న్యాయసంస్థలు, కలెక్టర్లు, ఎస్‌పీలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఇతర అధికారులతో రెండురోజులుగా సమావేశాలు నిర్వహించింది. చత్తీస్‌గఢ్‌లో ఇప్పటి వరకు 1.97 కోట్లమంది ఓటర్లు ఉన్నారని, అందులో మహిళలు 98.5 లక్షలు, పురుషులు 98.2 లక్షల మంది, 762 మంది ట్రాన్స్‌జండర్లు ఉన్నట్లు కుమార్ వివరించారు. కొత్త ఓటర్ల కోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టామని, తుది ఓటర్ల జాబితాను సెప్టెంబరు 11వ తేదీ తర్వాత ప్రకటిస్తామన్నారు. పోలింగ్ బూత్‌లు అన్నింటిలో మరుగుదొడ్లు, వీల్‌చైర్‌లు వంటి సదుపాయాలు కల్పిస్తామని కుమార్ చెప్పారు.

వారిపై గెరిల్లా యుద్ధతంత్రాన్ని వాడుతున్న పవార్
సంజయ్ రౌత్

ముంబై: తన పార్టీని వీడిన వారిపై పోరాడేందుకు గెరిల్లా యుద్ధ తంత్రాన్ని ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ వినియోగిస్తున్నారని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ అన్నారు. భారతీయ జనతా పార్టీతో యుద్ధ క్షేత్రంలో ఆయన పార్టీ తలపడుతోందని వ్యాఖ్యానించారు. శరద్ పవార్ ఎప్పటికీ బీజేపీతో జతకట్టబోరని రౌత్ శనివారం విలేకరులతో చెప్పారు. మహా వికాస్ అగాధీ, ఇండియా కూటమిలో ఆయన కీలక నాయకుడని అన్నారు. 'ఆయన రెండు పడవలపై ప్రయాణం చేయడం లేదు. శరద్ పవార్ విషయంలో ఎవరూ అయోమయానికి గురికావడం లేదు' అని రౌత్ తెలిపారు. చీలికలను శివసేన, ఎన్‌సీపీ ఎదుర్కొన్నాయనడంలో దాపరికాలు ఏమీ లేవన్నారు. పవార్ శుక్రవారం తమ పార్టీలో చీలిక లేదని చెప్పిన కొన్ని గంటలే తాను అలా అనలేదని ప్రకటించడంపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.

బాలికపై అధికారి అత్యాచారం కేసు...
గత ఫిర్యాదులపై చర్యలేవి?
ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మంత్రి అతిషి లేఖ

న్యూఢిల్లీ: గతంలోనే అత్యాచారాలకు సంబంధించి అనేక ఫిర్యాదులు ఉన్నప్పటికీ మైనర్‌పై అత్యాచారానికి పాల్పడిన అధికారిని మహిళా, శిశు అభివృద్ధి శాఖ(డబ్ల్యూసీడీ)లో పనిచేసేందుకు ఎందుకు అనుమతించారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరేశ్‌కుమార్‌ను ఢిల్లీ కేబినెట్ మంత్రి అతిషి ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆమె కోరారు. అదేసమయంలో ఆ అధికారిపై వేధింపులకు సంబంధించి ఎప్పుడెప్పుడు ఫిర్యాదులు వచ్చాయో తేదీలతో సహా వివరించాలని స్పష్టంచేశారు. ఈ నివేదికను ఆగస్టు 28 సాయంత్రం 5 గంటల లోగా అందజేయాలని తెలిపారు. ఢిల్లీలో మహిళా, శిశు అభివృద్ధి శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ప్రేమోదే ఖాఖా 2020 నవంబరు నుంచి 2021 జనవరి వరకు ఓ బాలికపై అనేకసార్లు అత్యాచారం చేసినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఆ అధికారి భార్య సెమ్మా రాణి ఆ బాలికకు మందులు ఇచ్చి గర్భ విచ్ఛిత్తికి పాల్పడింది. ఈ కేసులో భార్యాభర్తలను అరెస్టు చేయడానికి ముందు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆదేశాల మేరకు ఖాఖాను సస్పెండ్ చేశారు. నిందితుడు ఖాఖాపై వచ్చిన ఫిర్యాదులపై ఎవరైనా విచారణ చేశారా అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖలో మంత్రి అతిషి ప్రశ్నించారు. అదే సమయంలో ఈ ఫిర్యాదుల ఆధారంగా ఏమైనా క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారా అని అడిగారు. బాలికపై అత్యాచారానికి ముందే ఆ అధికారిపై అనేక అత్యాచార ఆరోపణలు, ఫిర్యాదులు ఉన్నట్లు మీడియాలో వార్తలు వచ్చాయని, ఇది చాలా తీవ్రమైన అంశమని, సకాలంలో చర్యలు తీసుకోకపోవడం తప్పుడు అధికారులను ప్రోత్సహించినట్లే అవుతుందని లేఖలో ఆమె పేర్కొన్నారు. ఆ అధికారిపై వచ్చిన ఆరోపణలను పట్టించుకోకుండా సీనియర్ అధికారులు గుడ్డిగా ఎలా ఉన్నారని మండిపడ్డారు.

నూహ్‌లో ఇంటర్నెట్ నిలిపివేత

- 28 వరకు 144 సెక్షన్ అమలు
- శోభయాత్రకు అనుమతి నిరాకరణ
- సరిహద్దు రాష్ట్రాల సీనియర్లతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్

చండీగఢ్: హరియాణాలోని నూహ్ జిల్లాలో తాజా హింస క్రమంలో సోమవారం శోభయాత్రకు పిలుపు ఇచ్చిన క్రమంలో రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తమైంది. తక్షణమే మొబైల్ ఇంటర్నెట్, బల్క్ ఎస్ఎంఎస్ సేవలను నిలిపివేస్తూ శనివారం ఆదేశాలిచ్చింది. సోమవారం వరకు 144 సెక్షన్ అమలు చేస్తూ నలుగురికి మించి గుమ్మిగూడేందుకు వీల్లేదని స్పష్టంచేసింది. ముందస్తు భద్రతా ఏర్పాట్ల క్రమంలో సరిహద్దు రాష్ట్రాల సీనియర్ పోలీసు అధికారులతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవల్సిన చర్యలపై చర్చించారు. ఈనెల 28న శోభాయాత్రకు హిందూత్వ సంస్థ ఇచ్చిన పిలుపు దృష్ట్యా హింస ప్రభావిత నూహ్ జిల్లాలో ఆంక్షల అమలయ్యాయి. డీజీపీ శత్రుజీత్ కాపూర్ సమావేశాన్ని నిర్వహించి పరిస్థితి చేయిదాటకుండా తీసుకోవాల్సిన చర్యలపై పంజాబ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, చండీగఢ్ నుంచి సీనియర్ పోలీసు అధికారులతో చర్చించారు. సెప్టెంబరు 3-7 తేదీల్లో నూహ్‌లో జీ20 షెర్పా గ్రూపు సదస్సు ఉండటంతో పాటు జులై 31న జరిగిన హింస పర్యవసానాల దృష్ట్యా శోభయాత్రకు అనుమతివ్వలేదు. అయినా దానిని ఎలాగైన నిర్వహించే యోచనలో హిందూత్వ సంఘం ఉన్నట్లు సమాచారం ఉండటంతో శనివారం నుంచి సోమవారం (28వ తేదీ) వరకు మొబైల్ ఇంటర్నెట్, ఎస్ఎంఎస్ సేవలను నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వ అదనపు సీఎస్ (హోం) టీవీఎస్ఎన్ ప్రసాద్ ఆదేశాలను జారీచేశారు. సీఆర్‌పీసీలోని సెక్షన్ 144ను అమలు చేసి నలుగురికి మించి ఒక చోట ఉండరాదని జిల్లా యంత్రాంగం తేల్చిచెప్పింది. అధికారికంగా అనుమతి లేనప్పటికీ 28న యాత్రను చేపడుతున్నట్లు సమాచారం ఉండటంతో పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొనేందుకు ఇంటెలిజెన్స్ సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని అధికారులతో డీజీపీ చెప్పారని, అదనపు డీజీపీ మమతా సింగ్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని అధికారిక ప్రకటన వెల్లడించింది.

వారణాసిలో జీ20 సాంస్కృతిక మంత్రులు భేటీ

వారణాసి: భారతదేశం జీ20 ప్రెసిడెన్సీలో భాగంగా శనివారం వారణాసిలో ఒక-రోజు సాంస్కృతిక మంత్రుల సమావేశం జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ వీడియో సందేశంతో సాంస్కృతిక మంత్రుల సమావేశం ప్రారంభమైంది. ప్రసంగంలో ఆయన సంస్కృతి ప్రాధాన్యతను వివరించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రసంగిస్తూ, సంస్కృతికి ఏకం చేయగల అంతర్లీన సామర్థ్యం ఉందని, ఇది విభిన్న నేపథ్యాలు, దృక్కోణాలను అర్థం చేసుకోవడానికి తమకు సహాయపడుతుందన్నారు. భారతీయులమైన మనం శాశ్వతమైన, వైవిధ్యమైన సంస్కృతి గురించి చాలా గర్విస్తున్నామని, అవ్యక్త సాంస్కృతిక వారసత్వానికి కూడా చాలా ప్రాముఖ్యతనిస్తామని అన్నారు. తాము వారసత్వ ప్రదేశాలను సంరక్షించడానికి, పునరుద్ధరించడానికి కృషి చేస్తున్నామని, సాంస్కృతిక ఆస్తిని తిరిగి పొందడం అనేది ఒక ముఖ్యమైన అంశంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. కల్చరల్ బృందం 'సంస్కృతి అందరినీ ఏకం చేస్తుంది' అనే ప్రచారాన్ని ప్రారంభించినందుకు తనకు ఎంతో సంతోషంగా వుందని మోదీ అన్నారు.

రాజధాని నిర్మాణానికి ఉచితంగా

భూములివ్వడమే నేరమా?

- కౌలు, పెన్షన్లు సక్రమంగా ఇవ్వడం లేదు
- పిల్లల్ని చదివించుకోలేకపోతున్నాం... పెళ్లిళ్లు చేయలేకపోతున్నాం
- సీపీఐ బస్సుయాత్ర రాకతో రైతుల కన్నీటి పర్యంతం

విశాలాంధ్ర -తాడేపల్లి/ తుళ్లూరు: 'ఈ ప్రాంతంలో రాష్ట్ర రాజధాని పెట్టాలని మేం కోరలేదు. ప్రజల కోసం, భావితరాల కోసం త్యాగాలకు సిద్ధపడి గత ప్రభుత్వం కోరితే రాజధాని లేని కొత్త రాష్ట్రం కోసం ఉచితంగా భూములిచ్చాం. అదే మేం చేసిన నేరమా? జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రాజకీయ కక్షతో మమ్మల్ని వేధిస్తోంది. రాజధాని నిర్మాణాన్ని ఆపేసి మాకు ఉపాధి లేకుండా చేసింది. మాకున్న కొద్దిపాటి భూములను ప్రభుత్వానికి అప్పగించి జీవనాధారం కోల్పోయాం. కౌలు, పెన్షన్లు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. వాటికోసం ప్రతి నెలా ఉద్యమం చేయాల్సి వస్తున్నది. మాకు ఇచ్చిన ప్లాట్లను నాలుగేళ్లుగా అభివృద్ధి చేయలేదు. వాటికి బ్యాంకులు సైతం రుణాలు ఇవ్వడం లేదు. దీంతో పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోలేకపోతున్నాం. పెళ్లిళ్లు చేయలేని పరిస్థితి నెలకొంది. అప్పులు కూడా పుట్టడం లేదు. ఆందోళనలో పాల్గొంటున్న రైతులందరిపై అక్రమ కేసులు బనాయించారు. కోర్టుల చుట్టూ తిరగడానికి డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నాం. మేం ఏం అన్యాయం చేశామని ప్రభుత్వం ఇలా వేధిస్తోంది' అని రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. 'దేశాన్ని కాపాడండి-రాష్ట్రాన్ని రక్షించండి' నినాదంతో సీపీఐ రాష్ట్రంలో నిర్వహిస్తున్న బస్సుయాత్ర శనివారం అమరావతి చేరుకుంది. బస్సుయాత్రకు రాజధాని రైతులు ఘనస్వాగతం పలికారు. అనంతరం తుళ్లూరు గ్రామంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సహా రాష్ట్ర ముఖ్యనేతలంతా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తొలి నుంచి అమరావతి ఉద్యమానికి అండగా ఉంటున్న సీపీఐకి వారు ధన్యవాదాలు తెలిపారు.

ఒకటి రెండేళ్లుగా కౌలు లేదు: సువర్ణ కమల

రాజధానిలో అసైన్డ్ మెట్టభూములు సాగు చేసుకుంటున్న పేదలకు రెండు సంవత్సరాలుగా కౌలు చెల్లించడం లేదు. పేదల పరిస్థితి దుర్భరంగా ఉంది. వడ్డీలకు డబ్బులు తీసుకొచ్చి పిల్లలను చదివించుకుంటున్నాం. మమ్మల్ని పెయిడ్ ఆర్టిస్టులు అనడానికి నోరు ఎలా వచ్చిందంటూ అంకం సువర్ణ కమల ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

తల్లి, చెల్లీ ఛీ కొడుతున్నారు: గుజ్జర్లపూడి లక్ష్మీకాంతమ్మ

సీఎం జగన్‌ను రాష్ట్ర ప్రజలే కాకుండా ఆయన తల్లి, చెల్లి కూడా ఛీ కొడుతున్నారని గుజ్జర్లపూడి లక్ష్మీకాంతమ్మ అనే వృద్ధురాలు మండిపడ్డారు. ప్రాణంతో సమానమైన భూములను రాజధాని నిర్మాణానికి ఇస్తే...తమను ప్రభుత్వం వేధిస్తోందన్నారు. రాజధాని నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ ఇప్పటికైనా నోరు విప్పాలన్నారు. మోదీ, జగన్ ఏకమై రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నాం: గౌరినేని స్వరాజ్యలక్ష్మి

నాలుగేళ్లుగా రాజధాని కోసం అవిశ్రాంతంగా ఉద్యమం చేస్తున్న తామంతా ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్నామని, సీఎం జగన్‌కు ఇవే చివరి ఎన్నికలని గౌరినేని స్వరాజ్యలక్ష్మి ధ్వజమెత్తారు. రాజధాని విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. అమరావతి రాజధాని విషయాన్ని న్యాయస్థానాలు సైతం తేల్చడం లేదని, ఇక ఎన్నికలే ఈ సమస్యకు పరిష్కారం చెపుతాయన్నారు.

కౌలు విషయంలో వేధిస్తున్నారు: మేదూరి నాగేశ్వరరావు

అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు కౌలు చెల్లించే విషయంలో ప్రభుత్వం కాలయాపన చేస్తూ రకరకాల నిబంధనలతో వేధిస్తోందని మేదూరి నాగేశ్వరరావు ఆరోపించారు. రాజధానిలో పనులు లేక మహిళలు ఆటోలలో 30 నుండి 40 కిలోమీటర్లు ప్రయాణించి కూలి పనులు చేసుకొని ఇంటికి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు పరిహారాన్ని ఎగ్గొట్టేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుందని మండిపడ్డారు.

ఓటుతోనే బుద్ధి చెబుతాం: పోలు దుర్గ

రానున్న అసెంబ్లీ ఎన్నికలలో ఓట్ల రూపంలో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని పోలు దుర్గ అనే మహిళా రైతు హెచ్చరించారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చి తప్పు చేశామని అనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాలు గడవడం కష్టంగా ఉంటుందని, పిల్లల చదువుల కోసం పడరాని పాట్లు పడుతున్నామని కన్నీటిపర్యంతమయ్యారు.

మా ప్లాట్లను అభివృద్ధి చేయడం లేదు: లంక సుధాకర్

రాజధాని నిర్మాణానికి ఉచితంగా భూములిచ్చిన తమకు ప్రభుత్వం ప్లాట్లు ఇచ్చింది. వాటిని అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం నాలుగేళ్లుగా పట్టించుకోవడం లేదని లంక సుధాకర్ అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాట్లు అడవిని తలపిస్తున్నాయి. అభివృద్ధి చేయమని ప్రభుత్వాన్ని అడిగితే పెయిడ్ ఆర్టిస్టులమని విమర్శిస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదని, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు: శీతారామయ్య

మా భూములకు గతంలో రుణాలిచ్చిన బ్యాంకులు ఇప్పుడు ఇవ్వడం లేదని ఇడుపులపాటి సీతారామయ్య వాపోయారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన ప్లాట్లకు సంబంధించిన పత్రాలు ఉన్నా యని చెబుతున్నా, ఆ కాగితాలు నాలుక గీసుకోవడానికి పనికిరావని బ్యాంకు అధికారులు చీదరించుకుంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. రైతులను ఈ విధంగా ఇబ్బందిపెట్టడం తగదని, ప్రభుత్వం ఇకనైనా రైతులకు సక్రమంగా కౌలు, కూలీలకు పెన్షన్లు ఇవ్వాలని కోరారు.

వైసీపీని గద్దె దించేందుకు పార్టీలన్నీ కలవాలి: బెల్లంకొండ నరసింహారావు

ప్రజాద్రోహానికి పాల్పడిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అన్ని పార్టీలు ఒకే వేదికపైకి రావాలని, ఇందుకోసం సీపీఐ కృషి చేయాలని బెల్లంకొండ నరసింహారావు అనే రైతు పార్టీ నేతలకు విజ్ఞప్తి చేశారు. తొలి నుండి సీపీఐ రాజధాని రైతులకు అండగా నిలిచిందని, తమలో పోరాటస్ఫూర్తిని నింపిందని కొనియాడారు. వైసీపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు రాజధాని అమరావతే కావాలని కోరుకుంటున్నాయన్నారు.

సీపీఐ సహకారం మరువలేనిది: పువ్వాడ

అమరావతి రాజధాని పోరాటంలో భారత కమ్యూనిస్టు పార్టీ సహకారం మరువలేనిదని అమరావతి జేఏసీ అధ్యక్షుడు పువ్వాడ సుధాకర్ సీపీఐ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వంతో ఇక తాడోపేడో తేల్చుకునే రోజులు దగ్గరకు వచ్చాయని, రైతులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ముఖ్య మంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ఇంటికి పంపడమే లక్ష్యంగా పనిచేస్తామని శపథం చేశారు.

అమరావతికి జై కొడితేనే తిరగనిస్తాం: కొలికపూడి

రాజధాని అమరావతికి జై కొట్టిన వారిని మాత్రమే రానున్న ఎన్నికల ప్రచారంలో రాజధానిలో తిరగనిస్తామని, లేకుంటే ప్రతిఘటిస్తామని అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొలికపూడి శ్రీనివాసరావు హెచ్చరించారు. సీఎం జగన్ విశాఖపట్నం వెళితే ఇకపై రాజధాని ప్రాంతంలో వైసీపీ ఫ్లెక్సీలు, బ్యానర్లు, సీఎం బొమ్మ కూడా ఈ ప్రాంతంలో ఉండటానికి వీల్లేదని, ఉంటే వాటిని స్వచ్ఛందంగా తొలగిస్తామన్నారు. దానికి తానే ముందుం టానని ప్రకటించారు. యుద్ధం చేసేవారికి కత్తి ఇవ్వాలని రాజకీయపార్టీలను కోరారు.

ప్రజలను దోచేస్తున్నారు

మంగళగిరి బహిరంగ సభలో రామకృష్ణ విమర్శ

బస్సుయాత్ర నేటి షెడ్యూల్

- గుంటూరులో బహిరంగ సభ
- నరసరావుపేటలో రోడ్ షో
- వినుకొండలో బహిరంగ సభ

విశాలాంధ్ర-తాడేపల్లి/మంగళగిరి: రాష్ట్రంలో నేడు గజదొంగల రాజ్యం... దోపిడీదారుల రాజ్యం... నడుస్తోందని వీరు ప్రజలను అన్ని రకాలుగా దోచుకుంటున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. 'రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి' అనే నినాదంతో సీపీఐ చేపట్టిన బస్సు యాత్ర శనివారం సాయంత్రం మంగళగిరికి చేరుకుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. రామకృష్ణ ప్రసంగం కొనసాగిస్తూ, ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని పైగా అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక దోపిడీ ద్వారా 40,000 కోట్లు వైసీపీ ప్రభుత్వం దోచేసిందని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోపణలపై వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని కోసం 1348 రోజులుగా రైతుల గోడు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి వినబడటం లేదా అని రామకృష్ణ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో రాజధాని తరలిపోదని అలా జరిగితే జగన్‌మోహన్ రెడ్డి కాళ్లు పట్టుకొని అయినా రాజధానిని ఇక్కడే ఉంచుతామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే నేడు మూడు రాజధానులపై మౌనంగా ఎందుకు ఉన్నారని నిలదీశారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి ధైర్యం ఉంటే జగన్ కాలర్ పట్టుకుని రాజధాని అమరావతిలోనే ఉంటుందని ప్రకటన చేయించాలన్నారు. అధికారం చేపట్టిన నాలుగున్నర ఏళ్ల కాలంలో కేంద్రం నుంచి రావలసిన ఒక్క హామీనైనా జగన్ సాధించారా అని రామకృష్ణ ప్రశ్నించారు. రాష్ట్రాన్ని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో, కుల, మత, భాష, ప్రాంతీయ విభజన తెచ్చి స్వాతంత్ర్య వీరుల త్యాగాలను బీజేపీ ప్రభుత్వం తుడిచి పెడుతున్నదని విమర్శించారు. చంద్రయాన్ 3 ప్రయోగం ద్వారా శాస్త్రవేత్తలు సాధించిన విజయాన్ని మోదీ తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, ధరలను తగ్గించుకోవడంతో పాటు అన్ని రకాల పెన్షన్లు పెంచుకోవడానికి ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ మంగళగిరి సమగ్రాభివృద్ధి కోసం సీపీఐ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి.జయలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించకుంటే ప్రజలకు భవిష్యత్తు ఉండదని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దోనేపూడి శంకర్ మాట్లాడుతూ చట్టసభలలో కమ్యూనిస్టుల గళం వినిపించవలసిన అవసరం ఉందని అన్నారు. మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య వందనసమర్పణ చేశారు. సీపీఐ మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు మధు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్, అధ్యక్షులు పి.రాజేంద్రబాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాధా కృష్ణ మూర్తి, ప్రజా నాట్య మండలి జాతీయ కార్యదర్శి గని, ప్రజానాట్యమండలి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్ర నాయక్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్‌కు చర్యలు

పాఠశాల విద్యా కమిషనర్ సురేశ్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని అన్ని జిల్లా విద్యాశాఖాధికారులు తమ అధికార పరిధిలోని సంబంధిత ప్రధానోపాధ్యాయులు, మండల డివిజన్ విద్యాశాఖ అధికారుల ద్వారా వస్తున్న ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యా కమిషనర్ సురేశ్ కుమార్ ఆదేశించారు. క్రమం తప్పకుండా మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను ధృవీకరించడానికి అవసరమైన సూచ నలను ఖచ్చితంగా జారీ చేయాలని శనివారం జిల్లా విద్యాశాఖ అధికా రులకు ఆయన సర్క్యులర్ జారీ చేశారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఖచ్చితంగా అందించేందుకుగాను తదుపరి చర్యలు తీసుకోవడానికి సంబంధిత ఉపాధ్యాయులకు ఎప్పటి కప్పుడూ స్థితిని తెలియజేయాలన్నారు.

ఆహ్వానము
పరిపాలన దురంధరుడు, రాజకీయరంగ భీష్మాచార్యుడు
ప్రొద్దుటూరు పురపాలక సంఘానికి
మూడు పర్యాయములు అధ్యక్షునిగా
ప్రొద్దుటూరు శాసనసభ్యునిగా ఈ ప్రాంత అభివృద్ధికి
ప్రజా సంక్షేమానికి అహర్నిశలు శ్రమించిన
కీ॥శే॥ పొణ్యం యర్రమునిరెడ్డి గారి
(1895-1974)
మాజీ మునిసిపల్ ఛైర్మన్, మాజీ శాసనసభ్యులు, ప్రొద్దుటూరు
కాంస్య విగ్రహావిష్కరణ
సమయం: 27-08-2023 తేది ఆదివారం ఉదయం 10-00 గం॥లకు
స్థలం: వై.యం.ఆర్. కాలని ఆర్చి, టి.బి. రోడ్డు, ప్రొద్దుటూరు
ముఖ్య అతిథి - విగ్రహ ఆవిష్కర్త
గౌ॥ శ్రీ రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి గారు
శాసనసభ్యులు, ప్రొద్దుటూరు
గౌరవ అతిథులు
గౌ॥ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యులు, రాష్ట్ర గ్రంథాలయ కార్పొరేషన్ ఛైర్మన్
గౌ॥ గంగుల ప్రభాకర్ రెడ్డి గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి మాజీ సభ్యులు, రాష్ట్ర నీటి వనరుల శాఖ సలహాదారులు
గౌ॥ శ్రీమతి భూమునిపల్లి లక్ష్మీదేవి గారు
ఛైర్‌పర్సన్, ప్రొద్దుటూరు పురపాలక సంఘం
ఆత్మీయ అతిథులు
గౌ॥ శ్రీ పాతకోట బంగారు మునిరెడ్డి గారు
వైస్ ఛైర్మన్, ప్రొద్దుటూరు పురపాలక సంఘం
గౌ॥ శ్రీ వరికూటి ఓబుళరెడ్డి గారు
LUNCH FOLLOWS

పత్రికా స్వేచ్ఛతోనే ప్రజాస్వామ్యానికి మనుగడ

- పాత్రికేయుల పోరాటానికి పౌర సమాజం మద్దతివ్వాలి
- ఐజేయూ కార్యవర్గ సమావేశాల్లో వక్తల పిలుపు

(పాట్నా నుంచి డి.సోమసుందర్)

పత్రికాస్వేచ్ఛ పరిరక్షణ కోసం పాత్రికేయుల పోరాటానికి అన్ని వర్గాలు మద్దతివ్వాలని, పత్రికా స్వేచ్ఛతోనే ప్రజాస్వామ్య మనుగడ ముడిపడి ఉన్నదని వక్తలు పిలుపునిచ్చారు. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) రెండురోజుల జాతీయ కార్యవర్గ సమావేశాల ప్రారంభసభ శని వారం ఉదయం బీహార్ శాసనమండలి ఉపభవనం సమావేశ మందిరంలో జరిగింది. ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శాసనమండలి చైర్మన్ దేవేశ్ చంద్ర ఠాకూర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య మనుగడకు పత్రికా స్వేచ్ఛ కీలకమని, అప్పుడప్పుడు కొన్ని సమస్యలు తలెత్తినప్పటికీ దేశంలో పత్రికా రంగం ప్రజాస్వామ్యం కోసం గట్టిగా నిలబడిందని గుర్తు చేశారు. కొన్ని సందర్భాల్లో ప్రతికూల పరిస్థి తులను ఎదుర్కొన్నప్పటికీ పత్రికారంగం ధైర్యంగా నిలిచిం దని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో మీడియాపై మరింత గురుతర బాధ్యత ఉందని, ఒత్తిళ్లకు, అణచివేతకు, భయానికి లోబడి పని చేయాల్సిన అవసరం మీడియాకు లేదని దేవేశ్ చంద్ర ఠాకూర్ అన్నారు. సమాజంలో ప్రజాస్వామ్య మూలాలు బలంగా ఉన్నాయని, సందర్భం వచ్చిన ప్పుడు ప్రజలు గట్టిగా నిలబడ్డారని చెప్పారు. పత్రికాస్వేచ్ఛ పరిరక్షణకు పాత్రికేయులు సాగించే పోరాటానికి పౌరసమాజం మద్దతు ఇవ్వాలని ఠాకూర్ పిలుపు ఇచ్చారు.

బీహార్ కార్మికశాఖ మంత్రి సురేంద్ర రామ్ మాట్లాడుతూ పాత్రికేయులకు సంకెళ్లు వేయడానికి ఎవరు ప్రయత్నించినా సఫలం కాలేరని, అలాంటి ప్రయత్నాలను ప్రతిఘటించాలని, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వా నికి వ్యతిరేకంగా మాట్లాడే మీడియా ప్రతినిధుల నోరు నొక్కేందుకు కొన్నేళ్లుగా జరుగుతున్న ప్రయత్నా లను గమనించాలని సురేంద్ర రామ్ అన్నారు. పత్రికాస్వేచ్ఛ కోసం, పాత్రికేయుల భద్రత కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పాత్రికేయుల పోరాటానికి తమవంతు మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. బీహార్ కాంగ్రెస్ శాసనసభపక్ష నేత షకీల్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ హయాంలో వేసిన ప్రజాస్వామ్య పునాదులను దెబ్బ తీసేందుకు నేటి పాలకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచనలు కొందరిలో కొనసాగు తున్నాయన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం సమాజంలో ప్రజలను కలిపి ఉంచే సిద్ధాంతాలని ఉద్ఘాటించారు. ప్రజా స్వామ్యం, లౌకికవాద పరిరక్షణకు పోరాడాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో శాస్త్రీయ దృక్పథం స్థానంలో ఛాందసవాదాన్ని, మూఢ నమ్మకాలను తెచ్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. శాస్త్రవేత్తల, సాంకేతిక నిపుణుల, కార్మిక సిబ్బంది కృషితో చంద్రయాన్-3 విజయవంతమైందని, అయితే నాలుగు రోజులుగా చంద్రయాన్‌పై ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని బ్రేకింగ్ న్యూస్‌గా మీడియా కొనసాగిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వానికి మద్దతుగా మీడియాలో పెద్ద విభాగం కృషి చేస్తోందని, వారు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు.

ఐజేయూ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఇటీవల చేపట్టిన చట్ట సవరణలు ప్రజాస్వామ్యానికి, పౌరహక్కులకు ప్రమాదకరంగా ఉన్నాయని, రాజద్రోహం చట్టాన్ని దేశద్రోహ చట్టంగా మార్చడం పత్రికా స్వేచ్ఛకు ప్రమాదసంకేతాలను ఇస్తోందని హెచ్చరించారు. వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని రద్దు చేసి తెచ్చిన లేబర్ కోడ్ మీడియా సిబ్బందికి ఏ విధంగానూ పనికి రాదని శ్రీనివాసరెడ్డి అన్నారు. దశాబ్దాలుగా ఉన్న హక్కులకు కేంద్రప్రభుత్వం మంగళం పాడుతోందని విమర్శించారు. చెన్నైలో జరిగిన ప్లీనరీ 'సేవ్ జర్నలిజం' పేరుతో పత్రికాస్వేచ్ఛ పరిరక్షణ కోసం పోరాడాలని పిలుపు ఇచ్చిందని గుర్తు చేశారు. సమావేశంలో బీహార్ అసెంబ్లీలో సీపీఐ పక్ష నాయకుడు సూర్యకాంత్ పాశ్వాన్, సీపీఐ ఎంఎల్ శాసనసభ్యుడు సందీప్ సౌరభ్, ఐజేయూ సెక్రెటరీ జనరల్ బల్వీందర్ సింగ్ జమ్ము, పూర్వాధ్యక్షుడు ఎస్ఎన్ సిన్హా, జాతీయ ఉపాధ్యక్షుడు అమర్ మోహన్ ప్రసాద్ మాట్లాడారు. జాతీయ కార్యవర్గ సమావేశాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి జాతీయ కార్యదర్శి వై.నరేంద్రరెడ్డి, జాతీయకార్యదర్శి డి.సోమసుందర్, జాతీయ కార్యవర్గసభ్యులు ఆలపాటి సురేశ్‌కుమార్, ఎంఏ మాజిద్, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి కె.విరాహత్ అలీ హాజరయ్యారు.


కీ॥శే॥ దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి గారు
Rtd. VRO
మరణం: 26.08.2023
శ్రద్ధాంజలి
మాకు అత్యంత ఆప్తులు, మా పెద్దాయన
శ్రీ దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి గారి
అకాల మరణానికి చింతిస్తూ, వారి పవిత్ర ఆత్మకు
శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ
శోకతప్త హృదయాలతో...
చెరుకూరి పద్మజ
మరియు
కుటుంబ సభ్యులు
బల్లవోలు, చిల్లకూరు మండలం

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Printing Press, Daminedu, Tirupati Rural, Chittoor Dist., Published at Visalaandhra Vignana Samithi, 9-91/5, Daminedu, Tirupati, Chitoor Dist, AndhraPradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.APTEL/2013/54631, Postal: Regd. No. VJ/042/2021-23, Phones : 9494377210, 7729991430, E-Mail : tiruvisal@gmail.com